

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.23

సహరి (శుక్రవారం) : 4.43


ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.4	26.6
కావలి	37.0	26.0
కందుకూరు	37.0	27.0
ఆత్మకూరు	41.0	26.0
ఉదయగిరి	41.0	24.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

గురువారం 4 ఏప్రిల్ 2024

పారని పాచిక!



కందుకూరులోని ఓ బ్యాంకులో నగదు కోసం సచివాలయాల సిబ్బంది ఎదురుచూపు



మనుబోలు-2 సచివాలయం వద్ద పింఛనుదారుల నిరీక్షణ

పింఛన్ల వ్యవహారంలో ప్రతిపక్షాలపైనే అబాంఢం వేయాలనుకున్నారు. అవ్వాతాతలు, దివ్యాంగులంతా ఉదయానికల్లా సచివాలయాల వద్దకు వస్తేనే పెన్షన్ సొమ్ము ఇస్తామని చాటింపు వేశారు. ఆ పిలుపు అందుకుని నానాయాతనలు పడుతూ ఉదయానికల్లా సచివాలయాలకు చేరిపోయారు. అయితే, తీరిగ్గా మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో బ్యాంకుల్లో నగదు చేశారు. డబ్బులు చేతికి అందడం ఆలస్యమైనా సచివాలయాల ఉద్యోగులు, గ్రామ కార్యదర్శులు ప్రశంసాపూర్వకంగానే పని చేశారు. కేవలం మూడు గంటల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 52 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసి అధికారపక్షం రాజకీయ ప్రయోజనానికి గండి కొట్టారు.

- పెన్షన్ కోసం సచివాలయాలకే రావాలని చాటింపు
- ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అవస్థలు
- మధ్యాహ్నం తర్వాత బ్యాంకుల్లో నగదు జమ
- సాయంత్రం నుంచి పింఛన్ల అందజేత
- 3 గంటల్లోనే 52 శాతం మందికి పంపిణీ



కలిగిరిలో పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

నెల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 19 మండలాల్లో గరిష్ఠంగా 73 శాతం నుంచి కనిష్ఠంగా 50 శాతం వరకు, 20 మండలాల్లో 25 నుంచి 45 శాతం వరకు పెన్షన్ పంపిణీ చేశారు. కందుకూరు, వలేటివారిపాళెం మండలాల్లో మాత్రం 10నుంచి 15 మందికి మాత్రమే పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 3,16,492 మంది పెన్షనర్లకుగాను బుధవారం 1,48,246 పింఛన్లు పంపిణీ చేశారు. ఇంకా 1,68,246 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. ఉదయమే బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేసి ఉంటే తొలిరోజే 80 శాతానికి పైగా పంపిణీ జరిగి ఉండేదనే వాదన వినిపిస్తోంది. వలంటీర్లను పక్కన పెట్టిన కారణంగానే ఇలా జరిగిందని పింఛనుదారులు భావించేలా, అందుకు ప్రతిపక్ష పార్టీలే కారణమనే అభిప్రాయం వారిలో కలిగేలా చేయడానికే ప్రభుత్వం ఆలస్యంగా బ్యాంక్ ఖాతాల్లో నిధులు జమ చేసిందనే ఆరోపణలు ఉన్నాయి.

● పడిగాపుల పాపం ఎవరిది!?

సాధారణ పరిస్థితుల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియలో తొలిరోజు 75 నుంచి 80 శాతం వరకు పంపిణీ జరుగుతుంది. ఉదయమే బ్యాంకుల్లో నగదు జమ చేసి ఉంటే బుధవారం కూడా అంతే శాతం పంపిణీ జరిగేది. కానీ బ్యాంక్‌ల్లో నిధులు జమ కావడంలో అసాధారణ జాప్యం జరిగింది. ఈ కారణంగా పింఛన్ల కోసం సచివాలయాల వద్ద అవ్వాతాతలు, దివ్యాంగులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. అసలు వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినా క్షేత్రస్థాయిలో అది అమలు కాలేదు. ఎవరైనా సరే సచివాలయం వద్దకు వచ్చి పింఛను తీసుకోవాలని చాటింపు వేయడంతో అంతా అక్కడకు చేరుకుని పడిగాపులు కాశారు. కొన్ని చోట్ల సచివాలయం వద్దకు చేరుకోవడానికి వృద్ధులు, దివ్యాం గులు 2, 3 కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ ఉత్తర్వులు సక్రమంగా అమలై ఉంటే పింఛనుదార్లకు ఈ అవస్థలు ఉండేవి కావు. వలంటీర్లు లేని కారణంగానే ఈ కష్టం వచ్చిందనే భావన పింఛనుదార్లలో కల్పించడానికి, ఆ పాపాన్ని ప్రతిపక్ష పార్టీలపై తోసేయడానికి అధికార వైసీపీ గట్టిగానే ప్రయత్నించింది. కానీ ఎన్ని అవాంతరాలు ఎదురైనా, సచివాలయాల వద్ద కొన్ని గంటల సేపు నిరీక్షించాల్సి వచ్చినా గ్రామ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది తొలిరోజు 52 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేయడంతో సమస్య తీవ్రత తగ్గింది. క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు అధికారపక్షం రాజకీయ ప్రయోజనానికి గండి కొట్టినట్లు అయ్యింది.



ఉదయగిరి-3 సచివాలయం వద్ద ఎండలో నిరీక్షిస్తున్న పింఛనుదారులు

14 వరకు ఓటరు నమోదుకు అవకాశం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 3 : నగరంలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో నెల్లూరు పార్లమెంటు, 8 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కూడా అక్కడే చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 20,44,814 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని చెప్పారు. ఫారం-6 దరఖాస్తులు 7,971 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మే 13న పోలింగ్ రోజున ఓటరు జాబితాలో చిన్న చిన్న తప్పులు, ఫొటోలు సరిగా లేకపోయినా భారత ఎన్నికల సంఘం సూచించిన 10 గుర్తింపు కార్డులలో ఒక దాన్ని చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని అన్నారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు, పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. భారీ ర్యాలీలు, సభలు, ప్రచారాలకు ముందస్తుగా సంబంధిత ఆర్వో నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. ఆ సమావేశంలో డీఆర్వో లవన్న, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంటు సుబ్రహ్మణ్యం, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోజు రోజుకూ ఎండ తీవ్రత అధికమవుతుండటంతో జిల్లాలోని ప్రధాన నీటి వనరుల్లో నీటిమట్టం దిగువస్థాయికి పడిపోతున్నది. సాగు, తాగునీటి అవసరాలు పెరిగి జిల్లాపై కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. పాలకుల నిర్లక్ష్యంతో గతేడాది జిల్లాకు ఆశించినస్థాయిలో నీరు లభించలేదు. ఈ సమస్యతో నీటి ఇబ్బందులు పడే ప్రమాదం నెలకొంది. సోమశిల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 79.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం క్రస్ట్‌గేట్ల దిగువకు 9.4 టీఎంసీలకు నీటిమట్టం పడిపోయింది. ఈ పరిస్థితిని చూసి జిల్లావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రెండో పంటకు నీరు లేక సాగుకు విరామం ప్రకటించే సమయం ఆసన్నమైంది. పంటలు పండించకపోతే తమ పరిస్థితి ఎలా అని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.



జలగండం!

- 'సోమశిల' పూర్తిస్థాయి నీటిమట్టం 79.988 టీఎంసీలు
- ప్రస్తుతం క్రస్ట్‌గేట్ల దిగువన 9.4 టీఎంసీలే..
- రెండో పంటకు విరామమే?
- పెరిగిన తాగు, సాగునీటి అవసరాలతో ప్రజల ఆందోళన

అనంతసాగరం, ఏప్రిల్ 3 : సోమశిల ప్రాజెక్టులో మొదటి పంట సాగుచేసే సమయానికి 36టీఎంసీల నీరు నిల్వ ఉండేది. సాగునీటి సలహా మండలి సమావేశంలో 2.6 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చేలా అధికారులు తీర్మానం చేశారు. అందుకోసం 26 టీఎంసీలు కేటాయించారు. మిగిలిన జలాలు తాగునీటి అవసరాల కోసం ఉంచాలని అధికారులు, పాలకమండలి సభ్యులు నిర్ణయించారు. ఆ దిశగా మొదటి పంటకు గతేడాది నవంబరు నుంచి నీరు విడుదల చేయగా నాన్‌డెల్టా పరిధిలోని కొన్నిచోట్ల ఇంకా పంటల దిగుబడులు చేతికందని పరిస్థితి ఉన్నది. ఈ దిగుబడులు చేతికందాలంటే ఈ నెల 20వ తేదీ వరకు నీరు ఇవ్వాల్సి ఉంది. ఆ దిశగా నీటి సరఫరా ఇంకా జరుగుతోంది. ఈ తరుణంలో సోమశిల డెడ్‌స్టోరేజ్‌కు చేరుకుంది. క్రస్ట్‌గేట్లకు 5 అడుగుల కిందకు నీటిమట్టం పడిపోయి డ్యాం కళావిహీనంగా మారింది. నీటినిల్వ తగ్గి 40 అడుగుల మేరకు కొండచరియలు బయటపడుతున్నాయి. సహజంగా మొదటి పంట ఏప్రిల్ 15వ తేదీకి పూర్తయితే.. ఆ తర్వాత డ్యాంలో నీటి లభ్యతను బట్టి రెండో పంటకు నీరు ఇచ్చేలా యంత్రాంగం చర్యలు చేపడుతుంది. ఈసారి ప్రాజెక్టు పరిధిలో తాగునీటికే ఇబ్బందిపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రెండో పంట సాగుకు విరామం అనివార్యమయ్యేలా కనిపిస్తున్నదని డెల్టా రైతులే చర్చించుకుంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోంది.

● ఈ ఏడాది ఆశించిన ధరలు..

వరి పంట దిగుబడులకు ఈ ఏడాది ఆశించిన ధర లభిస్తోంది. పుట్టి రూ.22 వేలు పలుకుతోంది. రెండో పంటకు సరిపడా నీరు ఉండి ఉంటే రైతుల ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడి ఉండేది. కాగా గతేడాది ఎగువ నుంచి మన జిల్లాకు రావల్సిన కృష్ణా జలాలు సమృద్ధిగా వచ్చి వుంటే ఈ నీటి ఇబ్బందులు వుండేవి కావనీ, ఆ దిశగా పాలకులు చర్యలు చేపట్టకపోవడంతో నేడు పొలాలు బీళ్లుగా పెట్టుకోవాల్సిన విపత్కర పరిస్థితి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

అడుగంటిన 'గండిపాళెం'



ఉదయగిరి రూరల్ : మెట్ట ప్రాంత రైతుల వరప్రదాయిని పొన్నెబోయిన చెంచురామయ్య (గండిపాళెం) జలాశయం అడుగంటుతోంది. 35 అడుగుల నీటి సామర్థ్యం కలిగిన ఈ జలాశయం పరిధిలో వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో 16 వేల ఎకరాల ఆయకట్టుతోపాటు ఆయా మండలాల్లో ప్రజల తాగునీటి కష్టాలు తీరుస్తోంది. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా జలాశయంలో నీటిమట్టం (3.5 అడుగులు) డెడ్‌స్టోరేజీకి చేరింది. దీంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి.

● వర్షాభావ పరిస్థితులు



ఉదయగిరి నియోజకవర్గంలో రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు సాగు, తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2019, 2020, 2021 సంవత్సరాల్లో పుష్కలంగా వర్షాలు కురవడంతో జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొంది. ఆ తర్వాత అరకొరగా వర్షాలు కురవడంతో 2022లో 24, 2023లో 11 అడుగుల మేర నీరు ఉండటంతో అధికారులు మెట్ట పంటలకు నీరు విడుదల చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరి పూర్తిస్థాయిలో అడుగంటిపోయింది. ఎండలు అధికంగా కాస్తుండటంతో ఉన్న నీరు సైతం పూర్తిగా అడుగంటే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఈ ఏడాదైనా వరుణుడు కరుణిస్తాడో లేదో వేచిచూడాలి మరి.

రెండోపంటకు నీరు లేనట్టేనా!?

బుచ్చిరెడ్డిపాళెం : సుమారు 3 లక్షల ఎకరాలకు సాగునీరందించే కనిగిరి రిజర్వాయర్ వెలవెలబోతోంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 3.45 టీఎంసీలు ప్రస్తుతం 0.7 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. జిల్లాలోని పది మండలాల రైతుల ఆయువు పట్టు అయిన కనిగిరి రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గుతుండటంతో ఆయకట్టు రైతుల్లో దిగాలు చెందుతున్నారు. అప్పోసప్పో చేసి పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చిన వెంటనే పెట్టుబడులకు తెచ్చిన అప్పులు, భూ యజమానికి లీజు చెల్లించి, రెండో పంట సాగు తర్వాత వచ్చేదే ఆదాయంగా వ్యవసాయం చేయడం కౌలురైతు పరిస్థితి. రెండో పంట కోసం ఇప్పటికే చాలామంది రైతులు పొలాలు దుక్కులు చేసుకుంటున్నారు. అయితే, నీటివిడుదలపై ఇరిగేషన్ అధికారులు ఏ నిర్ణయం వెల్లడించకపోవడంతో అందరిలో నిరాశ నెలకొంది. ఇరిగేషన్ ఏఈ వినయ్‌కుమార్ మాట్లాడుతూ కనిగిరి డ్యాంలో ఉన్న నీరు తాగునీటికి, పశువులకు తప్ప రెండో పంటక సరఫరా లేదన్నారు. అల్లూరు కాలువ, పైడేరు ఛానల్ కింద కొంతమేర లేతపంటలకు నీరు వదులుతున్నామని, అది కూడా మరో 10రోజుల్లో ముగుస్తాయని తెలిపారు.



భయపెడుతున్న 'కండలేరు'!

రాపూరు(డక్కిలి) : కండలేరు జలాశయంలో నీటి మట్టం అంతకంతకు తగ్గిపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పవన్న ఆందోళ నెలకొంది. కండలేరు జలాశయం పూర్తి సామర్థ్యం 68.3 టీఎంసీలు కాగా ప్రసుత్తం 8.060 టీఎంసీల నీరు ఉంది. డ్యాం నుంచి ప్రతిరోజు తాగునీటి అవసరాలకు 25 క్యూసెక్కులు, రైతుల కోసం 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మండుతున్న ఎండలకు డ్యాంలో నీటిమట్టం అడుగంటడంతో భూగర్భ జలాలు కూడా ఇంకిపోయాయి. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోకపోతే ముున్ముందు నీటికష్టాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పంటల నూర్పిళ్ళు పూర్తి కావస్తున్న దృష్ట్యా నీటి అవసరాలను గుర్తించి వినియోగించుకొంటే తాగునీటి ఎద్దడి తీవ్రతను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. డ్యాంలో నీటిమట్టం ఇంతకంటే తగ్గితే పంపింగ్ చేస్తే కానీ విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది.

తాగునీటికే రాళ్లపాడు నీరు!



కందుకూరు: సాగు, తాగునీటి అవసరాలకు ఉద్దేశించిన రాళ్లపాడు రిజర్వాయరు ఈ ఏడాది కేవలం తాగునీటికే పరిమితమైంది. ఏటా రబీలో వరి, వేసవిలో పత్తి సాగుకు నీరందించే ఈ రిజర్వాయరు ద్వారా ఈ ఏడాది ఒక్క ఎకరానికి కూడా సాగు నీరందించలేదు. రాళ్లపాడు ఆయకట్టులో వరిసాగుకి నీరందించే పరిస్థితి లేదని అధికారులు ముందుగానే ప్రకటించటంతో రైతులు సాగును విరమించుకున్నారు. అడపాదడపా వేసవి పత్తి సాగు చేసినప్పటికీ రిజర్వాయరులో నీరు తాగునీటి అవసరాలకే అంతంతమాత్రంగా ఉన్నాయన్న ఆలోచనతో అధికారులు ఆరుతడులకు కూడా నీరివ్వలేదు. దీంతో రైతులు బోర్లు ఆధారంగా తంటాలు పడుతున్నారు. 21 అడుగుల నీటిమట్టంతో 1.05 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన రాళ్లపాడు రిజర్వాయరులో ప్రస్తుతం 11.3 అడుగులు మాత్రమే నీరు నిల్వ ఉంది. ఈ నీరు 0.35 టీఎంసీలు ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. రిజర్వాయరుకు వర్షాధారంగా సహజ వనరులైన మన్నేరు, ఎలికేరుల ద్వారా కేవలం 14 అడుగులు (0.5 టీఎంసీలు) నీరు చేరగా సోమశిల ప్రాజెక్టు నుంచి రాళ్లపాడుకు జరిగిన కేటాయింపుల్లో అంతంతమాత్రంగానే వచ్చింది. సోమశిల నుంచి రాళ్లపాడుకు 1.5 టీఎంసీల నీటిని ఇవ్వాల్సి ఉండగా అందులో కేవలం 0.25 టీఎంసీలు మాత్రమే ఇచ్చి చేతులెత్తేశారు. దీంతో రిజర్వాయరు నిల్వ సామర్థ్యంలో సగం నీరుమాత్రమే ఉండగా అందులో 30 శాతం ఇప్పటికే తాగునీటి అవసరాలకు ఖర్చయింది. రాళ్లపాడు రిజర్వాయరు ఆధారంగా మూడు మంచినీటి పథకాల ద్వారా 80కి పైగా గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం ఉన్న నీటితో ఈ వేసవి అంతా ఇబ్బంది లేకుండా తాగునీరు సరఫరా చేయవచ్చని, వచ్చే ఏడాది అయినా వర్షాధారంతో రిజర్వాయరు నిండితేనే సోమశిల నుంచి వచ్చే అదనపు జలాలను ఆసరా చేసుకుని సాగునీరు ఇవ్వగలమని, లేనిపక్షంలో తాగునీటికే తప్ప సాగునీటికి గ్యారెంటీ లేదని అధికారులు తెలిపారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- 9వతేదీ వరకు నిర్వహణ
- జిల్లాలో 8 వేల మందికిపైగా హాజరు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 3 : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీ రింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి గురువారం నుంచి జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈనెల 9వతేదీ వరకు ఉదయం, మధ్నాహ్నం రెండు సెషన్లలో జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 8 వేల మందికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పర్యవేక్షణలో టీసీఎస్ ఈ పరీక్షలను నిర్వహిస్తోంది. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్నాహ్నం 3 నుంచి 6 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లాలో ఈ పరీక్షల నిర్వహణకు పొట్టేపాళెం సమీపం లోని అయాన్ డిజిటల్ సెంటర్, గూడూరులో నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాకు చెందిన మరికొంత మంది విద్యార్థులు ఇతర ప్రాంతాలు, జిల్లాలకు చెందిన పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసుకున్నట్లు కళాశాలల నిర్వాహకులు తెలిపారు. కాగా, ఉదయం సెషన్‌లో 7.30 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించి 8.30 గంటలకు మెయిన్ గేట్లు మూసేస్తారు. ఇదేవిధంగా మధ్యాహ్నం సెషన్‌కూ అమలు చేస్తారు.



కమిషనర్‌కు రాజీనామా పత్రాలు అందచేస్తున్న వలంటీర్లు

రాజీనామా చేయండి!

- వలంటీర్లపై వైసీపీ నేతల ఒత్తిళ్లు
- కావలిలో ఇప్పటివరకు 242 మంది రిజైన్

కావలి, ఏప్రిల్ 3 : రాజీనామాల కోసం వలంటీర్లపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. ఆ ఒత్తిళ్లు తట్టుకోలేక బుధవారం సాయంత్రానికి కావలిలో 242 మంది వలంటీర్లు తమ రాజీనామా ప్రతులను మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్‌కు అందజేశారు. వైసీపీ వార్డు ఇన్చార్జులు తమ పరిధిలోని వలంటీర్లను మున్సిపల్ కార్యాలయం వరకు తీసుకొచ్చి మరీ రాజీనామా చేయిస్తున్నారు. గడిచిన 3 రోజులుగా వలంటీర్లు, వైసీపీ నాయకులతో మున్సిపల్ కార్యాలయ ఆవరణం కిటకిటలాడుతోంది. వలంటీర్లంతా రాజీనామా చేయాలని వైసీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కనమర్లపూడి నారాయణ ఇచ్చిన పిలుపు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ తర్వాత రాజీనామా చేసిన కొందరు వలంటీర్లు వైసీపీ నేతలకన్నా ఘోరంగా తాము కావలి ఎమ్మెల్యే కోసం ప్రచారం చేసి గెలిపించుకుంటామని ఆడియోలో చెప్పినట్టే చెప్పడం అంతా ఒక పథకం ప్రకారం జరిగినట్లు తెలుస్తోంది.

విభేదాలు వీడి.. కలిసికట్టుగా పనిచేద్దాం!

- ఉదయగిరిపై టీడీపీ జెండా ఎగరేద్దాం
- నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి పిలుపు

వింజమూరు, ఏప్రిల్ 3 : విభేదాలు వీడి, అందరూ కలిసికట్టుగా పని చేయాలని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం వింజమూరు పట్టణంలోని కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో దుత్తలూరు, వరికుంటపాడు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీకి బలమైన నాయకత్వం, ఓటు బ్యాంకు కలిగిన మండలాలు ఈ రెండు మండలాలేనని అన్నారు. ఈ ప్రాంత నాయకులు, కార్యకర్తలు విభేదాలు వీడి కలిసికట్టుగా కృషి చేసి భారీ మెజారిటీ తీసుకురావాలని కోరారు. ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ మాట్లాడుతూ షెడ్యూలు ప్రకారం రేపటినుంచి పర్యటిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికి తిరిగి ఓటరును కలిసి వారికి టీడీపీ ప్రవేశ పెట్టే పథకాలను వివరిస్తామన్నారు. ప్రతిమండలంలోని ప్రతి సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఒక బృందంగా ఏర్పడి ఓటర్లను చైతన్యవంతం చేస్తూ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, టీడీపీ నేతలు చెంచలబాబు యాదవ్, ప్రశాంతమ్మ, రెండు మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్లను సత్కరిస్తున్న నాయకులు



సమావేశంలో పాల్గొన్న దుత్తలూరు, వరికుంటపాడు మండలాల నాయకులు



మండే ఎండల్లో మహిళలూ జాగ్రత్త!

- అశ్రద్ధ చేస్తే అనారోగ్యమే
- అవగాహన, అప్రమత్తత అవసరం
- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 3 : ఈ ఏడాది వేసవి అప్పుడే మండిపోతోంది. ఏప్రిల్ ప్రారంభంలోనే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. రాబోవు రోజుల్లో తీవ్రత మరింతగా ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యేకించి ఈ ఎండ తీవ్రత మహిళలపై అధిక ప్రభావం చూపే అవకాశం ఉందని సూచిస్తున్నారు. ఎండ వేడిమి, ఉక్కపోత వల్ల చమట రూపంలో రోజుకు రెండున్నర నుంచి మూడు లీటర్ల వరకు నీటిని కోల్పోయే అవకాశం ఉంటుంది. ఫలితంగా శరీరంలో నీరు, లవణాల శాతం తగ్గి నీరసం, కళ్లు తిరగడం, వడదెబ్బ వంటి సమస్యలు ఎదురవుతాయి. వీటికితోడు చర్మవ్యాధులు, తలనొప్పి, ఆకలి మందగించడం, మూత్రసంబంధిత వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. ఈ పరిస్థితిలో మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

గర్భిణులూ అప్రమత్తం

ఈ వేసవిలో గర్భవతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వారు డీహైడ్రేషన్‌కు గురైతే ఆ ప్రభావం గర్భస్థ శిశువుపై కూడా పడే అవకాశం ఉంది. సాధారణ మహిళల కంటే గర్భిణులలో వేడి శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితిలో వేసవి తీవ్రతకు గురైతే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

- వీలైనంత వరకు ఎండలోకి వెళ్లకుండా నీడపట్టున ఉండటం మంచిది. శరీరంలో తేమ శాతాన్ని కాపాడుకుంటే వడదెబ్బ నుంచి, ఇతర వేసవి రోగాల నుంచి రక్షణ పొందవచ్చు
- డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు ఎక్కువగా ద్రవ పదార్థాలు, పండ్ల రసాలు, నీటిని తీసుకోవాలి. ఆహారంలో ఉప్పు శాతం తగ్గించాలి.
- గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి.
- వ్యాయామం చేసే సమయాన్ని మార్చుకోవాలి. వాతావరణం చల్లగా ఉన్నప్పుడే వ్యాయామం చేయాలి.
- తేలికగా, వదులుగా, చమటను పీల్చుకునే గుణం ఉండే దుస్తులను వేసుకోవాలి.

కళ్లను కాపాడుకోవాలి

వేసవిలో కంటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సూర్య కిరణాలు నేరుగా కంటిపై పడితే ఆ తాపానికి కంటిలోని నరాలు దెబ్బతినే అవకాశం కూడా ఉంది. ఫలితంగా కళ్ల మసక బారటం, కంటి వ్యాధులకు లోనయ్యే అవకాశం ఉంది.

- వేసవిలో కంటిని సంరక్షణకు రంగు అద్దాలను వాడడం మంచిది.
- కళ్ల ఆరోగ్యంగా ఉండాలంటే శుభ్రమైన ఆహారం తీసుకుని ఎనిమిది గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి.
- చాలా మంది రాత్రిపూట నిద్రరాక బాధపడుతుంటారు. అలాంటి వారు పడుకునే ముందు ఒక లీటరు నీటిలో లిట్టస్ ఆకులు వేసి మరిగించి ఆ నీటిని తాగితే నిద్ర పడుతుంది.
- వేసవిలో పొడి వాతావరణం వల్ల పెరిగిన దుమ్ము, తేమ వల్ల కళ్లల్లో ఎర్రదనం వస్తుంది. కనురెప్పల మీద కురుపులు కూడా వస్తాయి. ఈ నేపథ్యంలో కంటి మీద దుమ్ము నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- కళ్లల్లో తేమ తగ్గి పొడిబారకుండా ఉండేందుకు తరచూ కళ్లను నీటితో కడుక్కోవాలి.
- కంటి సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

చర్మంపై ప్రభావం

మహిళల చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. ఎండకాలంలో పొడిచర్మం తత్వం కోల్పోయి ఇబ్బందికరంగా మారుతుంది. చీకాకు, దురద వంటి సమస్యలు తలెత్తుతాయి. కాళ్ల పగుళ్లు ఏర్పడుతాయి. చెమట కాయల సమస్య ఎక్కువగా ఉంటుంది. ఎండలో తిరగడం వల్ల బ్యాక్టీరియల్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి.

- ఎండ వేడిమికి మొటిమలు వచ్చి అవి మానిన తరువాత నల్లటి మచ్చలు ఏర్పడుతాయి. చర్మం కాంతి కూడా తగ్గుతుంది. ఈ క్రమంలో ముఖాన్ని తరుచుగా చన్నీటితో శుభ్రం చేసుకోవాలి.
- చెమట ఎక్కువగా పట్టడం వల్ల చర్మంపై ఉండే పల్చటి పొర త్వరగా దెబ్బతింటుంది. దీనివల్ల నుదిటిపై, చంకల్లో, వీపుపై చర్మం ముడతలు పడే భాగంలో చెమట కాయలు ఉత్పన్నమవుతాయి.
- చెమట దుర్వాసనను నిరోధించే యాంటీ పెర్‌స్పిరెంట్స్‌ను వాడాలి.
- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు ముఖానికి సన్‌స్క్రీన్ లోషన్ తప్పకుండా రాసుకోవాలి
- చర్మంపై తేమ ఉండేలా చూసుకోవాలి. దీనికోసం నీరు కలిపిన మాయిశ్చరైజింగ్ క్రీమ్‌ను రాసుకోవాలి
- పెద్దటోపీలను, కళ్లకు చలువ కళ్లద్దాలను దరించాలి



గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవి తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. గర్భిణులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. డీహైడ్రేషన్‌కు గురైతే ఆ ప్రభావం కడుపు లో శిశువుపై కూడా ఉంటుంది. ఎక్కువగా ద్రవాహారం తీసుకో వాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయ టకు రాకుండా ఉంటే మంచిది.

- డాక్టర్ బ్రిజిత, గైనకాలజిస్ట్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



చర్మ సంరక్షణ చాలా అవసరం

వేసవి తీవ్రత వల్ల చర్మ వ్యాధులు తలెత్తే ప్రమాదం ఉంది. చర్మం సున్నితత్వం కోల్పోయి చెమట కాయలు, మొటిమలతో పాటు చర్మం పొరపొరలుగా చీలిపోయి పెద్ద పుండ్లు ఏర్పడు తాయి. ఈ నేపథ్యంలో బయటకు వెళ్లేటప్పుడు వేసవి తీవ్రతను తట్టుకునే క్రీమ్‌లను రాసుకోవాలి. గొడుగులు వాడాలి. ఎక్కువగా తెల్లని దుస్తులు వేసుకోవడం మంచిది.

- డాక్టర్ విజయమోహన్‌రావు, చర్మ వ్యాధి నిపుణులు, నారాయణ ఆసుపత్రి

మూల్యాంకనం పక్కాగా నిర్వహించాలి

- కలెక్టర్ హరినారాయణన్



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 3 : నెల్లూరులో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఎటువంటి పొరపాట్లకు తావులే కుండా పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూల్యాం కన కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. విధులకు నియమించిన 1700 మంది సిబ్బంది నిబద్ధతతో మూల్యాంకనం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో పీవీజే రామారావు, డిప్యూటీఈవోలు రఘురాం, ప్రసన్నలక్ష్మి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ అసదుల్లా ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య హత్యకు యత్నించిన భర్త అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 3: అదనపు కట్నం కోసం భార్యను వేధించడమే కాకుండా హత్యాయత్నానికి పాల్పడిన భర్తను వేదాయపాళెం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని బీవీనగర్‌లో చిన్నయ్య కుటుంబం నివసిస్తోంది. ఆయన కుమార్తె సుహాసినికి ఆరేళ్ల కిందట టీపీ గూడూరు మండలం ఇస్కపల్లి గ్రామానికి చెందిన ఎం సతీష్‌బాబుతో వివాహం చేశారు. వారికి ఒక కుమారుడున్నాడు. సతీష్‌బాబు నగరంలోని కోటమిట్ట విద్యుత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ భార్య, కుమారుడితో ఎన్‌టీఆర్ నగర్‌లో నివసిస్తున్నారు. మద్యానికి బానిసైన సతీష్‌బాబు అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించడం ప్రారంభించాడు. పలుమార్లు పెద్దలు సర్దిచెప్పినా అతనిలో మార్పురాలేదు. ఇదిలా ఉండగా చిన్నయ్య ఈ నెల 1వ తేదీన కుమార్తె ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో భార్య, మామతో సతీష్‌బాబు గొడవపడి వారిని ఇంటి నుంచి గెంటేశాడు. దీంతో సుహాసిని తండ్రితో కలిసి పుట్టింటికి వెళ్లింది. పక్కరోజు సతీష్ పూటుగా మద్యం సేవించి అత్తవారింటి వెళ్లి భార్యపై హత్యాయత్నం చేశాడు. చిన్నయ్య, స్థానికులు రావడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. బుధవారం కోర్టులో హాజరు పరిచనట్లు ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ తెలిపారు.

చెరువు తూములో ఇరుక్కొని గిరిజన యువకుడి మృతి

- చేపల కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు..



గంధళ్ల పోలయ్య మృతదేహం

అల్లూరు, ఏప్రిల్ 3 : చెరువు తూములో చేపలు పట్టేందుకు వెళ్లి తూములో ఇరుక్కొని ఓ గిరిజన యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని సింగపేట వద్ద బుధవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అల్లూరు గిరిజన కాలనీకి చెందిన గంధళ్ల పోలయ్య (24) చేపల కోసం మరో వ్యక్తితో కలసి వెళ్లి సింగపేటకు సమీపంలో ఉండే అల్లూరు చెరువు నుంచి పొలాలకు నీరు విడుదల చేసే తూముకు వల కట్టాడు. ఆ తూములోకి దూరిన పోలయ్య ఎంతకీ రాకపోవడంతో అక్కడే ఉన్న మరో వ్యక్తి అతనిని గట్టిగా పిలిచినా సమాధానం లేకపోవడంతో తూములోకి దిగి పిలిచాడు. అయినా స్పందన లేకపోవడంతో భయాందోళన చెంది గ్రామంలోకి పరుగుతీసి కుటుంబసభ్యులను తీసుకొచ్చి తూములో గాలించారు. తూములో ఇరుక్కని ఉన్న పోలయ్యను బయటికి తీశారు. అప్పటికే అతను విగతజీవిగా మారాడు. ఈ ఘటనను కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోయారు. చేపలు పట్టుకొని వస్తానని వెళ్లిన రెండు గంటల వ్యవధిలోనే మరణించడంతో కుటుంబ సభ్యుల రోదన స్థానికులను కలచివేసింది. వీఆర్వో కృష్ణవేణి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, ఏప్రిల్ 3: రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన వెంకటాచలంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మనుబోలు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి భార్యతో మోటార్‌బైక్‌పై నెల్లూరు నుండి వారి ఇంటికి వెళ్తుండగా ఓ ఆటో బైక్‌ను ఢీ కొంది. ఈప్రమాదంలో వారిద్దరికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టాటా మ్యాజిక్ వాహనం దగ్ధం

- త్రుటిలో తప్పించుకున్న డ్రైవర్

వెంకటాచలం, ఏప్రిల్ 3: షార్ట్ సర్క్యూట్‌తో టాటా మ్యాజిక్ ప్యాసింజర్ వాహనం పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఈదగాలికి చెందిన మనోహర్ టాటా మ్యాజిక్ ప్యాసింజర్ వాహనంలో నెల్లూరుకు వెళ్లి తిరిగి ఈదగాలికి వస్తుండగా పొగలు వస్తుండటాన్ని గమనించాడు. దీంతో వెంటనే రహదారి పక్కన వాహనాన్ని నిలిపివేసి దూరంగా వచ్చేశాడు. అప్పటికే వాహనాన్ని మంటలు చుట్టుముట్టాయి. ఆ సమయంలో వాహనంలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడం, డ్రైవర్ మనోహర్ అప్రమత్తం కావడంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన టాటా మ్యాజిక్ వాహనం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	147
లేయర్ లైవ్	78
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	286
లేయర్	133

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6578
వెండి కిలో ధర	రూ. 79,900
వెండి ఒక గ్రాము	రూ. 81.90

వ్యాధి నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

- డీఎంహెచ్‌వో పెంచలయ్య



రికార్డులు అందచేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 3 : ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని ల్యాబ్ టెక్నీషియన్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. బుధవారం ఎల్‌టీలతో ఆయన కార్యాలయంలో సమీక్ష జరిపారు. రక్త పరీక్షల ద్వారా వ్యాధులను గుర్తించి బాధితులకు తగిన వైద్య చికిత్సలు అందేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను అందచేసి మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షల వివరాలను వాటిలో సకాలంలో నమోదు చేయాలన్నారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వల్లీ మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు మెరుగ్గా ఉండేలా చూడాలన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసి రికార్డులను సకాలంలో అందచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జున, సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు

- ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి



స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 3 : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా అదనపు వైద్యాధి కారి డాక్టర్ ఖాదర్ వల్లీ హెచ్చరించారు. బుధవారం నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రి, ఏఆర్‌సీ ఇంట ర్నేషనల్ ఫెర్టిలిటీ రీసెర్చ్ సెంటర్ స్కానింగ్ కేంద్రాలను వైద్యాధికారులు తనిఖీ చేశారు. వాటిలోని రికార్డులను పరిశీలిం చారు. లింగ నిర్ధారణ పరీక్షలు ఎట్టి పరిస్థితిలోనూ చేయరాదన్నారు. సమాజంలో లింగ నిష్పత్తి పెంపునకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డెమో శ్రీనివాసరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో పాడైన గుడ్లు



పాడైన ఉడకపెట్టిన కోడిగుడ్డు

వెంకటాచలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థు లకు మధ్యాహ్న భోజన పథకం కింద పెట్టే కోడిగుడ్లు పాడైపోయాయి. బుధవారం సుమారు వంద కోడిగుడ్లు ఉడకపెట్టి విద్యార్థులకు పెట్టగా వాటిని కొందరు విద్యార్థులు పాఠశాలలో తినకుండా ఇళ్లకు తీసుకెళ్లారు. ఉడక పెట్టిన కోడిగుడ్లలో కొన్ని పాడైపోయి దుర్వాసన వెదజల్లడంతో విద్యార్థులు విషయాన్ని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువెళ్లారు. కాగా, ఆ కోడిగుడ్లను వారం రోజుల కిందట ఉన్నత పాఠశాలకు సరఫరా చేసినట్లు తెలు స్తోంది. ఎక్కువ రోజులు నిల్వ ఉండి ఎండలు తీవ్రంగా ఉండడంతో గుడ్లు పాడైపోయి ఉంటాయంటున్నారు. ఇలా పాడైపోయిన కోడిగుడ్ల వల్లే విద్యార్థులకు విరోచనాలు, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- వెంకటాచలం

దాడి కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

కావలి రూరల్, ఏప్రిల్ 3: కావలి పట్టణం వెంగళరావునగర్‌కు చెందిన పేముల రాజేష్‌పై దాడికి పాల్పడిన కేసులో నిందితులు రాజేష్ భార్య స్వాతి, సోముశేఖర్‌లను బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద డీఎస్పీ వెంకటరమణ అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. గత నెల 28వ తేదీన దగదర్తి మండలం తురిమెర్లకు చెందిన సోముశేఖర్ వెంగళరావునగర్‌లోని రాజేష్ ఇంటికి వెళ్లి అతని భార్య స్వాతితో చనువుగా ఉండటాన్ని రాజేష్ ప్రశ్నించాడు. దీంతో కర్రతో రాజేష్ తలపై దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు పంపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి : ముగ్గురికి గాయాలు

కావలి రూరల్, ఏప్రిల్ 3: కావలి పట్టణం ముసునూరు టోల్ గేట్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బండ్ల చంద్ర(40) మృతి చెందగా ముగ్గురుకి గాయాలయ్యాయి. రూరల్ పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి జలదంకికి ఆహార పదార్థాలతో క్యాటరింగ్‌కు వచ్చిన మినీ లారీ తిరిగి నెల్లూరుకు వెళుతూ మార్గమధ్యంలోని ముసునూరు టోల్‌గేట్‌కు సమీపంలో రోడ్డు మార్జిన్‌లో ఆపుకుని టైర్లు చెక్ చేసుకుంటుండగా వెనుక వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ టక్ర్‌లో ఉన్న చంద్ర అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 3 : ఆదర్శ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21వతేదీ జిల్లాలోని 11 మోడల్ స్కూల్స్‌లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఆ పరీక్షకు హాజరయ్యేందుకు ఐదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 6వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలను www.cse.ap.gov.in, www.apms.ap.gov.in వెబ్‌సైట్ల నుంచిగానీ, సమీపంలోని ఆదర్శ పాఠశాలల నుంచి గానీ పొందవచ్చని తెలిపారు.

ఎన్డీఏ అభ్యర్థుల విజయానికి కృషి

- ఉమ్మడిగా ప్రకటించిన టీడీపీ, బీజేపీ, జనసేన



మాట్లాడుతున్న టీడీపీ నేత సోమిరెడ్డి

నెల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అరాచక పాలనను సాగనంపి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటుకు అందరం కలిసికట్టుగా పనిచేస్తామని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నేతలు ఉద్ఘాటించారు. బుధవారం నెల్లూరులోని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసంలో వారు ఉమ్మడిగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జగన్, సర్వేపల్లిలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి దోపిడీయే లక్ష్యంగా పనిచేశారని ఆరోపించారు. జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, మైనింగ్ వ్యవస్థలు మంత్రులు, ఎమ్మెల్యేల కాళ్ల కింద నలిగిపోయాయని విమర్శించారు. రాష్ట్రాన్ని గాడిన పెట్టాలంటే చంద్రబాబు సీఎం అవ్వాలని ప్రజలు విశ్వసిస్తున్నారని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. జనసేన నేత బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాటాడుతూ హిజ్రాల మంత్రి, విగ్రహాల మంత్రి, గ్రావెల్ మంత్రి, అవినీతి మంత్రిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేరు సంపాదించుకున్నారని దుయ్యబట్టారు. బీజేపీ నేత కాకుటూరు రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లిలో సోమిరెడ్డి, తిరుపతి ఎంపీగా వరప్రసాద్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు బొమ్మి సురేంద్ర, పెనుమల్లి వెంకట కృష్ణారెడ్డి, ఆరుముళ్ల మురళీ, కుంచి శ్రీనివాసులు, రాధాకృష్ణమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను విధుల నుంచి తొలగించాలి: బీజేపీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 3: జిల్లా కలెక్టర్ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి దాసోహమయ్యారని, వెంటనే ఆయన్ను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే వైసీపీ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్న పలువురు అధికారులను పక్కనపెట్టాలని కోరారు. మంత్రి కాకాణి ఓఎస్‌డీగా వ్యవహరిస్తున్న ఎంపీడీవో సరళ, డీపీవో సుస్మితారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈవో చిరంజీవితోపాటు పలువురు అధికారులను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నామన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి రాజకీయ అవగాహన లేకుండా ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ విషయంలో ప్రతిపక్షాలపై వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు నిరాధారమన్నారు. ఈ కార్యక్రమంలో నమామి గంగే కన్వీనర్ మిడతల రమేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెగరాల సురేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్, నాయకులు దాసరి రాజేంద్రప్రసాద్, కుప్పా ప్రసన్న, గిరికుమార్ గౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఒక్కపూటే అంగన్‌వాడీ కేంద్రాలు

నెల్లూరు (వీఆర్సీ), ఏప్రిల్ 3 : రోజురోజుకు ఎండలు మండుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటి పూటే నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ గురువారం ఉత్తర్వు లు జారీ చేశారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేంద్రాలను నిర్వహించాలని, కార్యకర్తలు తప్పనిసరిగా పనివేళలు పాటించాలని పీడీ ఆదేశించారు.

వలంటరీ వ్యవస్థతో ప్రజాస్వామ్యం ఖూనీ

- ఏపీ యునైటెడ్ ఫ్రంట్



సంఘీభావం తెలుపుతున్న ఏపీ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 3 : రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని జగనన్న వలంటరీ వ్యవస్థ ఖూనీ చేస్తోందని ఏపీ యునైటెడ్ ఫ్రంట్ చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ రఘు, నవరంగ్ (కాంగ్రెస్) పార్టీ వ్యవస్థాపకుడు షేక్ జలీల్ బాషా ఆరోపించారు. వారు బుధవారం నెల్లూరులోని జర్నలిస్ట్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అర్హులందరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కు ఉందని, దయచేసి వలంటీర్ల ద్వారా ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. 10 పార్టీల భాగస్వామ్యంతో తమ ఫ్రంట్ ఏర్పడిందని, సీబీఐ మాజీ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ కన్వీనర్‌గా ఉన్నారని తెలిపారు. అన్ని వర్గాలకు రాజ్యాధికారం రావాలన్న సంకల్పంతో ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాలకు పోటీ చేస్తున్నట్లు చెప్పారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వివిధ వర్గాలకు నేరుగా సాయం చేసి పరోక్షంగా ప్రతి ఇంటి నుంచి ఈ ఐదేళ్లలో రూ.20లక్షలు దోచిందని విమర్శించారు. ప్రస్తుత ఎన్నికల్లో జగన్ పార్టీ నుంచి ఓటుకు రూ.లక్ష తీసుకోండని పిలుపునిచ్చారు. జిల్లా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మద్యం తయారు చేసి 3 జిల్లాలకు ఆయనే విక్రయిస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని చోట్ల పోటీ చేస్తోందని నవరంగ్ కాంగ్రెస్ వ్యవస్థాప కుడు జలీల్‌బాషా తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం గుర్తింపు

మనుబోలు, ఏప్రిల్ 3: మండలంలోని వీరంపల్లి అమ్మోరు చెరువులో మంగళవారం రాత్రి బొనిగి కోటి (18)అనే యువకుడు గల్లంతైన విషయం విదితమే. బుధవారం ఎస్‌ఐ అజయ్ కుమార్ గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా కోటి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. కోటి మృతితో వీరంపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చేతికందివచ్చిన కుమారుడు చనిపోవడంతో కోటి తల్లిదండ్రులు బోరున విలపించసాగారు. శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేశమనేనిపల్లి డీలరు తొలగింపు

కలువాయి, మార్చి 3: కలువాయి మండలం కేశమనే నిపల్లి చౌకదుకాణం డీలరు ఆథరైజేషన్‌ను రద్దు చేసి, బాధ్యతల నుంచి తొలగించినట్లు తహసీల్దారు సంజీవకుమారి బుధవారం తెలిపారు. వైసీపీ నాయకులతో కలసి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో డీలరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారని ఆయన వివరించారు.

ఉదయగిరిపై టీడీపీ జెండా ఎగరడం తథ్యం : కాకర్ల



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న కాకర్ల సురేష్, వేదికపై వీపీఆర్ తదితరులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 3: వచ్చే ఎన్నికల్లో ఉదయగిరి కోటపై టీడీపీ జెండా ఎగరడం తథ్యమని ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో సీతారామపురం, ఉదయగిరి మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో మండల కన్వీనర్లు బయ్యన్న, ప్రభాకర్‌రాజుల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 నుంచి టీడీపీలో పనిచేసిన ప్రతి ఒక్కర్ని గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. మీ శ్రమ వల్లే మేం ఇక్కడ ఉన్నామని, మీరు లేకపోతే మేం లేమన్నారు. చిన్న చిన్న విబేధాలను పక్కనపెట్టి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు జోలికొస్తే ఎంతటివారినైనా సహించేదిలేదన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు, తాగునీటి కష్టాలు తీర్చి మెట్ట ప్రాంత రూపురేఖలు మార్చేస్తామన్నారు. వలసలు నివారించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పింఛన్ల పంపిణీలో అధికార పార్టీ పెద్ద కుట్ర పన్ని ప్రతిపక్షంపై బురదచల్లే పన్నాగం పన్నుతుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డిలు మాట్లాడుతూ నమ్మిన వారిని నట్టేటముంచిన నమ్మకద్రోహి సీఎం జగన్‌రెడ్డి అన్నారు. గతంలో ఇద్దరు ఒక్కటైతే గెలిచేవారమని, ఇప్పుడు నలుగురం అయ్యామని, అత్యధిక మెజార్టీ తప్పదన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. అనంతరం వేమిరెడ్డి, కాకర్లకు నాయకులు పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు శాంతకుమారి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, మన్నేటి వెంకటరెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, సీతారామపురం సర్పంచి భాగ్యమ్మ, బీజేపీ నేత కదిరి రంగారావు, జనసేన నేతలు భోగినేని కాశీరావు, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీలో చేరికలు

వింజమూరు మండలం బొమ్మరాజుచెరువులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం దుత్తలూరు మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌ల ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు ఉండేలా గురవారెడ్డి, కనసాని సుబ్బారెడ్డి, మద్దిరెడ్డి వెంకటసుబ్బరామిరెడ్డి, రెడ్లదిన్నె సర్పంచి ఉండేల నాగమ్మ, ఎంపీటీసీ మీసాల వెంకటేశ్వర్లు తదితరులు వారి అనుచరులతోపాటు మండలంలోని నందిపాడు, వెంకటంపేట, రెడ్లదిన్నె, పాపంపల్లి, భైరవరం, రాచవారిపల్లి, బ్రహ్మేశ్వరం, బండకిందపల్లి గ్రామాలకు చెందిన సుమారు 200 కుటుంబాల వారు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి వేమిరెడ్డి, కాకర్ల కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

● ఇఫ్తార్ విందులో కాకర్ల

ఉదయగిరి మండలంలోని వెంగళరావునగర్‌లో బుధవారం రాత్రి ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, వాజీద్, బీ.వెంకటేశ్వర్లు, కాకి ప్రసాద్, బొడ్డు లక్ష్మయ్య, ఆగర సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎండకు ఉపశమనం



సంగం, ఏప్రిల్ 3: ఎండలు తీవ్రంగా ఉన్నాయి. బుధవారం 40 డిగ్రీలపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ట్రాక్టర్‌పై ప్రయాణం చేసే కూలీలు ట్రాక్టర్‌పై పట్టలు కట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. పొదలకూరుకు చెందిన పలువురు యాత్రికులు మల్లెంకొండకు వెళ్లి వస్తూ ఎండ తీవ్రత కారణంగా నీడ కోసం ట్రాక్టర్‌పై పట్టలు కట్టుకుని ప్రయాణం చేయడం ఆంధ్రజ్యోతి కంట పడింది.

● ఎండలతో జాగ్రత్త సుమా!

చేజర్ల : రోజురోజుకి పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ కే గోపికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన సమాచారం మేరకు ఈనెల నుంచి జూన్ వరకు ఎండలు విపరీతంగా ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వీలైనంత వరకు మధ్యాహ్నం 12 గంటల లోపు పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఎక్కువగా ద్రవపదార్థాలు తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు ఎక్కువగా బయట తిరగకుండా ఉండాలన్నారు.

విద్యార్థినికి అభినందనలు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 3: స్థానిక బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న రాపూరి ప్రణీత నవోదయ ప్రవేశ పరీక్షలో సీటు సాధించింది. దీంతో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 తోట శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో విజయం సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జీ.నాగయ్య, ఉపాధ్యాయులు షేక్ యస్థానీ, హకీమ్‌గౌస్‌బాషా, మొహమ్మద్, సారధి తదితరులు పాల్గొన్నారు.

వీపీఆర్‌ను సన్మానించిన లీగల్ సెల్

ఉదయగిరి రూరల్ : వింజమూరు మండలం బొమ్మరాజుచెరువులో గల టీడీపీ కార్యాలయంలో బుధవారం నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వచ్చే ఎన్నికల్లో వేమిరెడ్డితోపాటు ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ కమిటీ సభ్యులు గొట్టిపాటి మనోరమ, కల్లూరి తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక దళాల కవాతు

వింజమూరు, ఏప్రిల్ 3 : పట్టణంలో బుధవారం కేంద్ర ప్రత్యేక దళాలు బంగ్లా సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ కోటిరెడ్డి తెలిపారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా ఈ కవాతు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేక మహోత్సవాలు

ఆత్మకూరు : పట్టణంలోని శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు మూడు రోజుల నుంచి వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం విష్వక్సేన పూజ, పుణాహవచనం, తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం కుంభారాధన, మహాశాంతిహోమం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జయహో బీసీ సభలను జయప్రదం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న కాకర్ల సురేష్ తదితరులు

వింజమూరు, ఏప్రిల్ 3: త్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా జరిగే జయహో బీసీ సభలను జయప్రదం చేయాలని ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. వింజమూరులోని కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బీసీల కోసం ప్రత్యేక మేనిఫెస్టోను ప్రవేశ పెట్టాడని తెలిపారు. 50 ఏళ్లు నిండిన బీసీలకు పెన్షన్ ఇవ్వాలని, బీసీలకు పెళ్లి కానుకగా రూ.లక్ష, చంద్రన్న బీమా రూ.10లక్షలు, ఆరోగ్య పథకం ద్వారా రూ.5లక్షలు, బీసీ రక్షణ నిధి రూ.10వేల కోట్లు, రూ.1.50వేల కోట్లతో సబ్‌ప్లాన్‌ను అమలు చేయనున్నారని పేర్కొన్నారు. ఈ విషయాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన కార్యకర్తలను, నాయకులను కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ పి.చెంచలబాబుయాదవ్, బీసీ నాయకులు రవీంద్రబాబు, గంజం రాఘవేంద్ర, చింతనబోయిన బయన్న, పోలుపోయిన శ్రీకాంత్, పాముల మహేష్, వేములపాటి మణికుమార్, చల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● నేటి నుంచి కాకర్ల ప్రచారం

సీతారామపురం : నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ గురువారం ఉదయం 8 గంటల నుంచి మండల పరిధిలోని చిన్ననాగంపల్లి నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారని నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కే. భాగ్యకుమారి, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల వరకు పల్లెల్లో ఇంటింటికి ప్రచారం చేస్తారని, ఉదయగిరి మండలంలో ఈనెల 9న ఎన్నికల ప్రచారం ముగిస్తుందన్నారు. పార్టీ కార్యకర్తలు,నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

బెదిరింపులకు భయపడొద్దు.. అండగా మేముంటాం!



ప్రచారం చేస్తున్న లక్ష్మీ సాయిప్రియ

కలువాయి, ఏప్రిల్ 3: టీడీపీకి ఓటు వేస్తే ఇబ్బంది పెడతామని వైసీపీ నాయకులు చేస్తున్న బెదిరింపులకు ఎవరూ భయపడవద్దని, మీకు అండగా మేం ఉంటామని వెంకటగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ భరోసా ఇచ్చారు. మండలంలోని కుల్లూరులో బుధవారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు. వైసీపీ రాక్షస పాలనను తరిమికొట్టేందుకు అందరూ కలసి యుద్ధం చేయాలని కోరారు. అధికారంలోకి రాగానే కుల్లూరులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను విస్తరిస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట పార్టీ నాయకులు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, నరాల సునీల్, చల్లా రాజేష్ రెడ్డి, షేక్ కాలేషా, కేతా సోమిరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి : డాక్టర్ కంచర్ల



సన్మానం పొందిన డాక్టర్లు రవీంద్రనాథ్, రమేష్

ఏఎస్‌పేట,ఏప్రిల్ 3 : విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, తద్వారా దేశాభివృద్ధి చెందుతుందని గ్లోబల్ ఆసుపత్రి (హైదరాబాద్) అధినేత డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్, రెయిన్‌బో ఆసుపత్రి అధినేత డాక్టర్ కంచర్ల రమేష్ తెలిపారు. బుధవారం వారు తమ స్వగ్రామమైన చిరమనకు విచ్చేశారు. ఈ సందర్భంగా తమ సహకారంతో ఏర్పాటు చేసిన హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు.హైస్కూల్‌లో ఇతర సౌకర్యాల గురించి హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం తెలియ చేయగా, త్వరలోనే సమకూర్చుతామన్నారు. పీహెచ్‌సీలో సమావేశం గది నిర్మిస్తామని, అవసరమైన మందులను ఉచితంగా అందిస్తామన్నారు. అనంతరం వారిని శాలువా లు,పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జ్యోతిరాణి, నాగవినుత, గ్రామస్థులు కంచర్ల రమాధర్‌నాయుడు,ఉప్పుగండ్ల అంకయ్యచౌదరి, కే సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలి



ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, ఏప్రిల్ 3 : లబ్ధిదారులకు పింఛన్లను సక్రమంగా పంపిణీ జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని టీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు వారు బుధవారం, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు. వృద్ధులు, దివ్యాంగులు తదితరులకు సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పీ జయకర్, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు. తోడేటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

● 80 చోట్ల పింఛన్ల పంపిణీ

సంగం : మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టారు. 13 సచివాలయం పరిధిలో సచివాలయంతోపాటు మరో మూడు నాలుగు చోట్ల కలిపి మొత్తం 80 చోట్ల తాత్కాలిక పింఛన్ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి పంపిణీ ప్రారంభించారు. మండలంలో మొత్తం 6,830 పింఛన్లు ఉండగా సాయంత్రం 6 గంటలకు 60.5 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మిగిలిన పింఛన్లను గురువారం పంపిణీ చేస్తామన్నారు.

అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా!

చిట్రగుంట, ఏప్రిల్ 3: బోగోలు మండలం ఎస్‌జీపీ కండ్రిక పంచాయతీ నుంచి స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ ప్రచారం నిర్వహించారు. బీజీపీ కండ్రిక, జక్కేపల్లిగూడూరు, ఏబీ కండ్రిక, నాగులవరం, ఏకే కండ్రిక గ్రామాల్లో ఆయన పర్యటిస్తూ ఓట్లు అభ్యర్థించారు. పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా గ్రామాల్లో తాను చేస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. ఆయన వెంట పసుపులేటి వెంకటేశ్వర్లు, సురేష్, ఏడుకొండలు, వెంకటరమణయ్య, శ్రీహరినాయుడు, సుబ్బారావు, జగదీష్, ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 3: పట్టణంలోని షాదీమంజిల్‌లో బుధవారం రాత్రి ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక : కావ్య



టీడీపీలో చేరిన యువతతో కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 3: రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని కూటమి ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మూడు పార్టీల నేతలు మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు, వారి భవిష్యత్తు, ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సి నిధులు, జరగాల్సిన అభివృద్ధి కోసమే రాష్ట్రంలో మూడు పార్టీలు జతకట్టాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అరాచకపాలన నుంచి రాష్ట్రాన్ని కాపడేందుకు కూటమిగా ప్రజల్లోకి వస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ పట్టణ అధ్యక్షులు గుత్తికొండ క్రిషోర్, పొబ్బా సాయి విఠల్, కే.బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసక పాలనను తరిమికొడదాం

నవరత్నాల మాటున రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంలోని శక్తులు, కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆయన అనుచరులు అన్నిరకాలుగా ప్రజల సొమ్మును దోపిడీ చేస్తున్నారని, ఈ విధ్వంసక పాలనను తరిమి కొడదామని కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కావలి టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కావలిరూరల్ మండలం ఆనెమడుగు పంచాయతీ మొండిదిన్నెపాలెం, కట్టకింద పాలెం గ్రామాలకు చెందిన యువత కోనంకి కిషోర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి కావ్య ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంకట్రావు, కండ్లగుంట మధుబాబునాయుడు, అద్దంకి ప్రభాకర్, ఉప్పాల వెంకటేశ్వర్లు, కోనంకి అశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి



సమావేశంలో టీడీపీ నాయకులు

కొండాపురం, ఏప్రిల్ 3: తెలుగుదేశంతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ముస్లింలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా మసీదుల నిర్మాణాలకు, అభివృద్ధికి నిధులు కేటాయించడంతోపాటు దుల్హన్ పథకం, రంజాన్‌తోఫా పథకాలు అమలు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం వాటన్నింటిని రద్దు చేసిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించుకొని ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును, నెల్లూరు ఎంపీగా వీపీఆర్‌ను, ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను గెలిపించి వైసీపీకి చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యారవ క్రిష్ణయ్య, పీ.రమేష్, షేక్ ఖాసిం, దామా మహేశ్వరారవు, వెంకటాద్రి, పీ.చంద్రబాబునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో బొల్లినేని భేటీ



కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొల్లినేని వెంకటరామారావు

జలదంకి, ఏప్రిల్ 3: కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు బుధవారం నాగపూర్‌లోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బొల్లినేని కేంద్రమంత్రికి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం గడ్కరీ ఇచ్చిన అల్పాహారవిందులో పాల్గొని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత రాజకీయఅంశాలపై చర్చించినట్లు బొల్లినేని తెలిపారు. ఎన్డీఏలో టీడీపీ చేరిన తరువాత ఏపీలో కూటమి విజయావకాశాలపై వీరివురి మధ్య సుదీర్ఘ చర్చ కొనసాగిందని పేర్కొన్నారు.

రోజుకు రూ.300 వచ్చేలా పని చేయించాలి

లింగసముద్రం, ఏప్రిల్ 3 : ఉపాధి హామీ పథకంలో కూలీలకు రోజుకు రూ.300 వచ్చేలా పని చేయించాలని రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి వేణుగోపాల్ చెప్పారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతిరోజూ కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి 11 గంటల వరకు చేయాలన్నారు. పని ప్రదేశంలో మార్కింగ్ విధానం, కొలతలు, ఫారం పాండు పనులు, నూతన మార్గదర్శకాల గురించి సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యుశేషబాబు, జెక్యూసీ కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

31వ వార్డులో టీడీపీ ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఇంటూరి సౌజన్య

కందుకూరు, ఏప్రిల్ 3: పట్టణంలోని 31వ వార్డు పరిధిలోని ఎల్ఐసీ ఆఫీసు ఎదురుప్రాంతంలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య బుధవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు అత్తంటి శివకృష్ణ, ముచ్చు శ్రీను, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, నల్లబోతుల మురళి, జమ్ము చైతన్యలక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, ఆహారం పంపిణీ

ఉలవపాడు, ఏప్రిల్ 3 : ఉలవపాడులోని కోటిరెడ్డి కుంట ఎస్టీలకు యూత్ హెల్పింగ్ ఆర్గనైజింగ్ ఆధ్వర్యంలో బుధవారం దుస్తులు, భోజనం, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. టంగుటూరు గ్రామానికి చెందిన షేక్ ఖాసీం, సుల్తాన్‌ల కుమార్తె సమీర జ్ఞాపకార్థం మొదటి వర్ధంతి సందర్భంగా పేదలకు రంజాన్ మాసంలో సాయం చేయాలని మహిళలకు చీరలు, పిల్లలకు డ్రస్ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సభ్యులు దేవరపల్లి చంద్రశేఖర్, పొదిలి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు : ఆర్వో



మాట్లాడుతున్న ఆర్వో శీనానాయక్

కావలి, ఏప్రిల్ 3: ఎన్నికల కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కావలి రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో బుధవారం రాజకీయపార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశం ఆయన ఎన్నికల కోడ్ నిబంధనలు అతిక్రమిస్తే తీసుకొనే చర్యలు గురించి వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏ రాజకీయ పార్టీ నాయకులు తమ ప్రచారాల సమయంలో కానీ ఇతర సమయాల్లో కానీ బాణాసంచా కాల్చకూడదన్నారు. సభలు సమావేశాలకు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. నామినేషన్ల సమయంలో పాటించాల్సిన నిబంధనలను, ఈవీఎంలు ఎప్పుడు వస్తాయి వాటి భద్రత, ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం, పోస్టల్ బ్యాలెట్లు ఎప్పుడు ఇస్తారు, వాటిని ఎలా వినియోగించుకోవాలి తదితర అంశాలపై వివరించారు. ప్రతి రాజకీయ పార్టీ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు.

కూటమి విజయమే లక్ష్యంగా పనిచేస్తాం

● ఇంటూరికి మద్దతు తెలిపిన ఎంఆర్పీఎస్ నాయకులు



మాట్లాడుతున్న ఇంటూరి, ఎంఆర్పీఎస్ నేతలు

కందుకూరు, ఏప్రిల్ 3: ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయం కోసం శక్తివంచన లేకుండా పని చేస్తామని, రాష్ట్రంలో చంద్రబాబు విజయం మాదిగ జాతి విజయంగా తాము భావిస్తున్నామని ఎంఆర్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని ఎంఆర్పీఎస్ నాయకులు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జనసేన, బీజేపీ బలపరుస్తున్న టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఎంఆర్పీఎస్ నాయకులు జలదంకి నరసింగరావు, వర్ల దేవదాస్ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు నేలపాటి రాజు, రావినూతల ముత్తు, రావినూతల ఐజాక్, పున్నేపల్లి శ్రీనివాసులు, జంగిలి లెనిన్, గౌడపేరు బాబు, చేవూరి శ్రీను, చదలవాడ శ్రీనాథ్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల మద్దతు : టీడీపీ అభ్యరి ఇంటూరి నాగేశ్వరరావుకు మద్దతుగా టీడీపీలో చేరేందుకు పలువురు ఆర్యవైశ్య వ్యాపారులు ముందుకు రాగా వారికి నాగేశ్వరరావు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రకాశం జిల్లా ఆర్యవైశ్యసంఘం కార్యదర్శి తాతా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తాతా సీతారామాంజనేయులు బ్రదర్స్, పద్మనాభుని మార్కండేయులు, కందుకూరు క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తాతా మోహనరావు అండ్ సన్స్, కోట నరసింహం, తుమ్మపూడి సుబ్బయ్య, గుర్రం మహేష్, కారంశెట్టి వెంకన్న, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు అండ్ బ్రదర్స్ గుర్రం హరిబాబు, గుర్రం చిన అల్లూరయ్య, కొత్త శ్రీనివాసరావు తదితరులు టీడీపీలో చేరారు.

బృందావనంలో ఇంటింటి ప్రచారం : పట్టణంలోని 5వ వార్డు పరిధిలోని బృందావనంలో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట స్థానిక పార్టీ నాయకులు, బృందావనం యువకులు పాల్గొన్నారు.

ముస్లిం ద్రోహి సీఎం జగన్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ముస్లిం నేతలు

కావలి, ఏప్రిల్ 3: ముస్లింల ప్రయోజనాల కోసం గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు అమలు చేసిన దుల్హన్ పథకం, రంజాన్‌తోఫా వంటి అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసిన ముస్లింల ద్రోహి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ముస్లిం నేతలు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ముస్లిం ద్రోహి జగన్ అనే ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2014లో టీడీపీ, బీజేపీ పొత్తు ఉండిందని, ఆ పాలనలో ముస్లింల అభివృద్ధి, సంక్షేమం నిరాటంకంగా కొనసాగిందన్నారు. టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకోవడం కొత్తేమి కాదని, దీనివలన ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. కావలి ఎమ్మెల్యేగా కావ్య క్రిష్ణారెడ్డిని, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిల విజయానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ రహీం, హఫీజ్‌మస్తాన్, ఖాదర్‌బాషా, ఇట్టు, రఫీ, ఖమర్‌బాబు, హజరత్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో తీవ్ర జాప్యం

● జగన్ రాజకీయ లబ్ధి కోసమేనంటున్న ప్రతిపక్షాలు



లింగసముద్రం: పింఛను అందజేస్తున్న సిబ్బంది

ఉలవపాడు, ఏప్రిల్ 3 : పథకం ప్రకారం పింఛన్లు పంపిణీ ఆలస్యం చేసి ఆ నెపం టీడీపీపై, చంద్రబాబుపైకి నెట్టి రాజకీయ లబ్ధి పొందాలనేదే జగన్‌రెడ్డి వ్యూహమని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. మండలంలో బుధవారం సాయంత్రం వరకు సచివాలయాల వద్ద వృద్ధులు, వితంతువులు పింఛన్ కోసం పడిగాపులు కాచారు. తీరా 4 గంటలకు బ్యాంక్‌ల నుంచి నగదు తీసుకొచ్చి తీరిగ్గా పంపిణీ మొదలు పెట్టారు. ఉదయం నుంచి ట్రెజరీ నుంచి నగదు బ్యాంకులకు జమ కాలేదని, మధ్యాహ్నం 3 గంటలకు ఖాతాల్లో జమకావడంతో తీసుకొచ్చామని సచివాలయ సిబ్బంది చెప్తున్నారు.

కలిగిరి : ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ద్వారా బుధవారం పింఛన్ల పంపిణీ జరిగింది. సచివాలయాలకు వచ్చి లబ్ధిదారులు పించన్లను తీసుకెళ్ళారు. అనారోగ్యానికి గురైై సచివాలయ కేంద్రానికి రాని లబ్ధిదారులను గుర్తించి ఇంటికెళ్లి అందజేసినట్లు అధికారులు తెలిపారు.

లింగసముద్రం : మండలంలో బుధవారం మధ్యాహ్నం 3.30 నుంచి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. సాయంత్రం 7 గంటల వరకు మండలంలోని 13 సచివాలయాల పరిధిలో సుమారు 43 శాతం మంది లబ్ధిదారులకు నగదు అందజేశామని ఎంపీడీవో యు శేషబాబు చెప్పారు.

తాగునీటి సమస్య కూడా పట్టదా?



ప్రచారంలో కోటారెడ్డి, గిరిధర్, బినీత్‌రెడ్డి

అల్లూరు, ఏప్రిల్ 3 : వైసీపీ ప్రభుత్వానికి తాగునీటి సమస్య కూడా పట్టడం లేదని రానున్న ఎన్నికల్లో టీడీపీ తరపున ఎంపీగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కావ్య కృష్ణారెడ్డిలను గెలిపిస్తే మండలంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తామని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి అన్నారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డితో కలసి బుధవారం పట్టణ పరిధిలోని మధ్యకాపు వీధి, తూర్పు కాపువీధి, దసరా దేవాలయం, రాయాజి వీధి, తూర్పు మహమ్మదీయ పాలెం, కుమ్మరవీధిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులరెడ్డి, కృష్ణచైతన్య, అరగల రమణయ్య, ఊటు శ్రీకాంత్ రెడ్డి, ఊటు అశోక్‌రెడ్డి, పరంధామరెడ్డి, అనూరాధ పాల్గొన్నారు.

విష్ణు అనుచరుడు టీడీపీలో చేరిక : మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి వీరాభిమాని రామిశెట్టి శీనయ్య బుధవారం స్థానిక టీడీపీ కార్యకర్త మంగిశెట్టి సురేష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ విష్ణు పోటీలో ఉంటే తన మద్దతు ఆయనకే ఉంటుందని, ఆయన తనకు నచ్చని వైసీపీలో చేరడంతో తాను టీడీపీలో చేరానన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

● నేలటూరులో నిబంధనలకు తిలోదకాలు



నేలటూరు నుంచి మట్టి తరలిస్తున్న టిప్పర్లు

ముత్తుకూరు, ఏప్రిల్ 3: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా రాత్రి పగలు తేడా లేకుండా మండలంలోని నేలటూరులో వైసీపీ నాయకులు మట్టిని తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత కొద్దిరోజులుగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకున్నా అడ్డగోలుగా తవ్వేసి మట్టిని భారీ టిప్పర్లతో బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. మట్టికి విపరీతమైన డిమాండ్ ఉండడంతో, టిప్పర్ మట్టిని రూ.10వేల వరకు అమ్ముకుంటున్నట్లు తెలిసింది. ఇంత భారీస్థాయిలో తవ్వకాలు జరుగుతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇటీవల టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రచారం సందర్భంగా వైసీపీ నాయకులు సాగిస్తున్న మట్టి అక్రమ తవ్వకాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకుని అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటి వద్దే పింఛన్లు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే !



ఎంపీడీవోకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 3: ఇంటివద్దే పింఛన్లు ఇచ్చేలా చేయాల్సిన బాధ్యత వైసీపీ ప్రభుత్వానిదేనని టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం మండల అభివృద్ధి అధికారి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో చంద్రబాబు నాయుడిని బాధ్యుడిగా చేయాలని వైసీపీ బురద జల్లుతోందని ఆరోపించారు. వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులకు గురికాకుండా సచివాలయ సిబ్బంది చేత పింఛన్ల పంపిణీ చేయాలని కోరారు. టీడీపీ నాయకులు ముత్యాల శ్రీనివాసులు, ఇంగిలాల నిర్మలమ్మ, బీజేపీ నాయకులు అన్నం శ్రీనివాసులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కొడవలూరు: ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందచేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గరికపాటి రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

జూన్ వరకు డీలర్ల వద్దే సరుకుల పంపిణీ



కేఆర్‌పురం డీలర్ షాపును తనిఖీ చేస్తున్న సీఎస్‌డీటి నాగేశ్వరరావు

మనుబోలు, ఏప్రిల్ 3: ఎక్కడైతే ఎండియూ ఆపరేటర్లు రాజీనామాలు చేసి ఉంటారో అక్కడ నిత్యావసర సరుకులను ప్రజలు డీలర్ల వద్దకు వెళ్లి జూన్ వరకు తెచ్చుకోవాలని సీఎస్‌డీటి నాగేశ్వరరావు తెలిపారు. కేఆర్‌పురం డీలర్ షాపులో సరుకుల పంపిణీ బుధవారం ప్రారంభించారు. షాపు తనిఖీ చేసిన డీటి మాట్లాడుతూ మండలంలో 8మంది ఎండియూ ఆపరేటర్లు ఉన్నారన్నారు. అయితే ఇటీవల నలుగురు రాజీనామాలు చేశారన్నారు. మనుబోలు-1, మనుబోలు-2, గోవిందరాజ పురం, జట్లకొండూరు ఆపరేటర్లు రాజీనామాలు చేయ డంతో ఆయా ప్రాంతాల్లో డీలర్లు సరుకులు పంపిణీ చేస్తారన్నారు. మిగిలిన చోట్ల ఆపరేటర్లు ఇళ్లకు వచ్చి సరుకులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీటి శ్రీకాంత్‌రెడ్డి, విఆర్‌వో నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవూరులో సాయుధ దళాల కవాతు

కోవూరు, ఏప్రిల్ 3: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో సాయుధ దళాలు ప్రదర్శన చేశాయి. కోవూరు, లేగుంటపాడు, ఇనమడుగు, వేగూరు, గుమ్మళ్ల దిబ్బ గ్రామాల్లో కవాతు చేశారు. ఎస్‌ఐ రంగనాథగౌడ్ ఆధ్వర్యంలో సాయుధ దళాలతోపాటు స్థానిక పోలీసులు కూడా కవాతులో పాల్గొన్నారు.

ఓటు నమోదుకు అవకాశం

వెంకటాచలం, ఏప్రిల్ 3 : గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఇంకా అవకాశం కల్పించినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ పూర్ణచంద్రరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఓటర్ల జాబితా తదితర వివరాలు తెలియజేశారు. సమావేశంలో తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నపాళెంలో ప్రచారం

మనుబోలు, ఏప్రిల్ 3: మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో బుధవారం రాష్ట్ర వ్యవసాయమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, నాయకులు పాల్గొన్నారు.

కామాక్షమ్మ సాక్షిగా అభివృద్ధి చేస్తాం!

● జొన్నవాడ, పెనుబల్లిలో ప్రశాంతిరెడ్డి ప్రచారం



జొన్నవాడ రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 3: జొన్నవాడ కామాక్షమ్మ సాక్షిగా ఒక్క జొన్నవాడలోనే కాదు.. కోవూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని కోవూరు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జొన్నవాడ, పెనుబల్లి గ్రామాలలో వారు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా తనను సైకిల్ గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 5 మండలాల్లో సమస్యలు తాండవిస్తున్నాయ ని, ఈ ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, మళ్లీ చంద్రబాబునాయుడిని గెలిపించుకుంటేనే రాష్ట్రం అభివృద్ధికి నోచుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలం రెడ్డి దినేష్‌రెడ్డి, జొన్నవాడ, పెనుబల్లి సర్పంచులు, ఆయా గ్రామాల టీడీపీ పాత, కొత్త, నాయకులు, గ్రామకమిటీ నాయకులు, ఉమ్మయ్యస్వామి, శ్రీధర్‌స్వామి, రత్నం, పెంచలయ్య, శీనయ్య, సురేంద్ర, మహేంద్ర, మండల నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, సుబ్రమణ్యంనాయుడు, ఎంపీ శేషయ్య, హరికృష్ణ, భువనేశ్వరం మురళి, గుత్తా శ్రీనివాసులు, కత్తి మహేష్, రామానాయుడు, వుసురుపాటి, హరనాథ్, మైనారిటీ నాయకులు, దళిత నాయకులు వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో టీడీపీ నాయకులు

కోవూరు: కొత్తూరు దళితకాలనీలో బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేపట్టారు. స్థానిక టీడీపీ నాయకులు కాగొల్లు శ్రీనివాసులు, పూండ్ల సురేంద్రబాబు, గుండాల ప్రసాద్, గుం డాల కావమ్మ, జోరేపల్లి వేణు, మర్లపాటి మస్తానయ్య ఇంటింటికీ తిరిగి పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలను గెలిపిం చాల్సిందిగా కోరారు. పేదల సమస్యల సాధనకు పనిచేసే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతిరెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి



ఎన్నికల ప్రచారంలో టీడీపీ కార్యకర్తలు

కొడవలూరు: నియోజకవర్గ అభివృద్ధి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమని జిల్లా టీడీపీ పార్లమెంట్ సెక్రటరీ చెక్క మదన్‌మోహన్ అన్నారు. మండలంలో కొత్త వంగళ్ళులో బుధవారం ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో టీడీపీ విజయం తథ్యం : సోమిరెడ్డి

● బిరదవోలులో 200 కుటుంబాల చేరిక



బిరదవోలులో టీడీపీలో చేరిన నాయకులు

పొదలకూరు, ఏప్రిల్ 3: సర్వేపల్లిలో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బిరదవోలు గ్రామంలో ఏర్పాటుచేసిన ప్రచార సభలో సోమిరెడ్డి సమక్షంలో వెన్నపూస రమణారెడ్డి, వెన్నపూస శ్రీనివాసులురెడ్డి, రావులు శ్రీనివాసులు గౌడ్, సుధాకర్‌గౌడ్, యత్తపు వెంకటరెడ్డి, భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు బిరద వోలు, ముత్యాలపాలెం, కల్యాణపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ బిరదవోలు పంచాయతీ ఒకప్పుడు టీడీపీ కంచుకోటని, మళ్లీ ఇప్పుడు పూర్వ వైభవం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, ముక్కు అయోధ్య రామయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాకాణి ధనదాహంతోనే కంటైనర్ టెర్మినల్ మూసివేత

ముత్తుకూరు: కాకాణి ధన దాహానికి అదాని కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలిపోయిందని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక మత్స్యకార నాయకుడు అక్కయ్యగారి ఏడుకొండలు ఆధ్వర్యంలో బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరిన ముత్తుకూరు మధురానగర్‌కి చెందిన 35 కుటుంబాలను కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు నీలం మల్లికార్జున్‌యాదవ్, యదనపర్తి శ్యామ్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అక్రమాలు..!

● రూ. కోట్ల ప్రజాధనం దుర్వినియోగం

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 3: మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) పథకం అమలులో పలు అక్రమాలు చోటుచేసుకుని కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తోటపల్లిగూడూరు మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి దాదాపు 9వేల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 50 శాతం కుటుంబాలు మాత్రమే ఈ పథకం కింద లబ్ధిపొందుతున్నట్లు సమాచారం. వారిని మినహాయిస్తే మిగిలిన 50 శాతం కుటుంబాలు ఈ పథకాన్ని వినియోగించుకోవడం లేదని, అయితే ఈ 50శాతం కుటుంబాలు కూడా కూలీ పనులకు హాజరవుతున్నట్లుగా రికార్డుల్లో నమోదు అవుతుండడం గమనార్హం. కాగా, ఉపాధి పనులకు వెళ్లని వారి పేర్లతో మంజూరవుతున్న కూలీ సొమ్ములు స్వాహా అవుతున్నాయి. కాగా, ఒకరోజు రూ.260 నుంచి రూ.270 వరకు వుంటుందని తెలుస్తోంది. ఉపాధి పనులకు వెళ్లే 50 శాతం మంది కూలీలను మినహాయిస్తే కూలీ పనులకు వెళ్లని మిగిలిన 50 శాతం మంది ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నట్లు తెలిసింది. ఒక్క వరకవిపూడి పంచాయతీలోనే రోజుకు 50, 60 మంది వరకు కూలీల డబ్బులు స్వాహా అవుతున్నాయన్న ఆరోపణలు వున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని 22 పంచాయతీల్లో 10 పంచాయతీలకు పైగా గత ఐదేళ్ల క్రితం నుంచి కోట్ల రూపాయల ఉపాధి నిధులు స్వాహా అవుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహిస్తున్న బహిరంగ సామాజిక తనిఖీలు నామమాత్రంగా సాగుతున్నాయన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పింఛన్లపై వైసీపీ రాజకీయం

● టీడీపీ సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ



ఎన్నికల ప్రచారంలో నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 3 : సామాజిక పింఛన్ల పంపిణీపై వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మాజీ మంత్రి, నెల్లూరు నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ విమర్శించారు. ఆయన బుధవారం నగరంలోని 45వ డివిజన్‌లో పర్యటించారు. ప్రభుత్వ ఖజానాలో నగదు లేక, ఓడీ తెచ్చుకోలేక సమయానికి పింఛను అందించలేకపోయారన్నారు. ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయానికి తమను ఆరోపిస్తూ వైసీపీ రాజకీయాలు చేయడం సరికాదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్‌దారుడి ఇంటికే వెళ్లి తాము కూడా పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, నగరంలోని 6వ డివిజన్‌లోనూ నారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల అరాచక పాలనకు చమరగీతం పాడుతూ అందరూ టీడీపీని గెలిపించాలని అభ్యర్థించారు.

● సంతపేట రాఘవ కల్యాణమండపంలో టీడీపీ మైనార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

● నారాయణ సతీమణి రమాదేవి 5, 52, 16 డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రాంతాలను నారాయణ మరింత అభివృద్ధి చేసి చూపిస్తారని హామీ ఇచ్చారు. నారాయణ కుమార్తె శరణి నగరంలోని 10వ డివిజన్‌లో జరిగిన ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

● 49వ డివిజన్‌లో టీడీపీ నేత కేతంరెడ్డి వినోద్ ప్రచారం చేశారు.

అమ్మమ్మను స్మరించేలా..!

● రసరమ్యంగా ఎంఎస్ సుబ్బులక్ష్మి మనుమరాళ్ల కచేరీ



నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 3 : అలనాటి సంగీత విద్వన్మణి, భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి గాత్రాన్ని శ్రోతలు స్మరించుకునేలా ఆమె మనుమరాళ్లు ఐశ్వర్య - సౌందర్య గాత్ర కచేరీ చేశారు. నెల్లూరు పురమందిరంలో జరుగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాల్లో బుధవారం రాత్రి వారి కచేరీ సంగీత ప్రియులను స్వర ఝరిలో ఓలలాడించింది. ఐశ్వర్య - సౌందర్య ద్వయానికి వాద్య సహకారాన్ని వయోలిన్ మాతూరు విశ్వజిత్, మృదంగం ఫణీంద్ర భాస్కర్ అందించారు. ఉదయం నీళ్ల సరస్వతీ భాగవతార్ లవకుశ హరికథా గానం చేశారు. మధ్యాహ్నం సుందరకాండ హరికథను బుర్రా పద్మనాభశర్మ గానం చేశారు. సాయంత్రం స్థానిక సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి పంచరత్న గోష్ఠితో ఆకట్టుకున్నారు.

వ్యక్తిగత విమర్శలు వద్దు

● కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 3 : విమర్శలు చేసే వారు, తాము చేసిన సంక్షేమ, అభివృద్ధి అంశాలను ప్రజలకు చెప్పి ఓట్లు వేయించుకోవాలని, వ్యక్తిగత విమర్శలు వద్దని కోవూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం నగరంలోని ఆమె నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధిని కోరుకుంటూ, వైసీపీ అరాచక పాలన వద్దనుకొని టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో 6వేల మందిపై అక్రమ కేసులుపెట్టారన్నారు. 180 మంది దళితులు మరణించారని తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రత్నం సార్.. లేనిలోటు తీర్చలేనిది!

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ నివాళి



రత్నంకు నివాళులర్పిస్తున్న నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 3 : రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం సార్ లేని లోటు తీర్చలేనిదని మాజీ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ధనలక్ష్మీపురంలోని రత్నం సీబీఎస్‌ఈ పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన రత్నం సంస్మరణ సభలో ఆయన పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లాకు కార్పొరేట్ విద్యను పరిచయం చేసిన దిగ్గజం మన మధ్య లేకపోవ డం బాధాకరమన్నారు. ఆయన విద్యారంగానికి చేసిన సేవలను ఎనలేనివ న్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, రత్నం కుమారులు వేణుగోపాల్, డాక్టర్ కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

రానున్నది కూటమి ప్రభుత్వమే

● రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి



పార్టీలో చేరిన కార్యకర్తలతో కోటంరెడ్డి సోదరులు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఏర్పాటు కానున్నది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమేనని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని ఆయన కార్యాలయంలో పలు ప్రాంతాల నుంచి వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలోకి వస్తున్న ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలను బట్టే టీడీపీ స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి రానున్నదని అర్థమవుతోంద న్నారు. కొత్తవెల్లంటి గ్రామం, నగరంలోని 30, 33 డివిజన్లకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం, నగదు, మారణాయుధాల రవాణా నిషేధం

● నగర కమిషనర్ వికాస్ మర్మత్



కారును తనిఖీ చేస్తున్న సిటీ ఆర్వో, కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున వాహనాల్లో మద్యం, నగదు, మారణాయుధాల రవాణా నిషిద్ధమని నెల్లూరు నగర రిటర్నింగ్ అధికారి, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ స్పష్టం చేశారు. బుధవారం సిటీ నియోజక వర్గ పరిధిలోని సాలు చింతల చెక్‌పోస్టు వద్ద నగరంలోకి వస్తున్న వాహనాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలు ఎన్నికల కోడ్‌లోని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. నిషేధిత సామగ్రి రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాంటివి రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని పౌరులను ఆయన కోరారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండరు ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 3 : నగరంలోని పొగతోటలో గల ఆదిశంకర ధ్యాన మందిరంలో బుధవారం రాత్రి శ్రీక్రోధి నామ సంవత్సర తెలుగు క్యాలెండరు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా జ్యోతిష శాస్త్ర పండితుడు స్వయంపాకుల శ్రీనివాసులు హాజరయ్యారు. క్యాలెండరు ముద్రణకు సహకరించిన 14 మందిని చక్రాల వారి ట్రస్ట్ ఘనంగా సత్కరించింది. వయోలిన్ వాద్య కళాకారుడు పాలేటి గోవర్ధన్‌శర్మ కచేరీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గుడ్లదొన వాసుదేవ రావు, చక్కాల ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, పారా గురు వెంకట శర్మ, అన్నవరం సత్యనారాయణ, మల్లవరపు లక్ష్మీ నరసింహారావు, మైపాడు రాజా, మువ్వా ప్రసాద్, మందిరం మేనేజర్ సమయానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

రోజుకు రూ.300 వచ్చేలా పని చేయించాలి

లింగసముద్రం, ఏప్రిల్ 3 : ఉపాధి హామీ పథకంలో కూలీలకు రోజుకు రూ.300 వచ్చేలా పని చేయించాలని రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి వేణుగోపాల్ చెప్పారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతిరోజూ కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి 11 గంటల వరకు చేయాలన్నారు. పని ప్రదేశంలో మార్కింగ్ విధానం, కొలతలు, ఫారం పాండ్ పనులు, నూతన మార్గదర్శకాల గురించి సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యు శేషుబాబు, జెక్యూసీ కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు అమ్మితే దుకాణం సీజ్

● ఎంహెచ్‌వో వెంకట రమణయ్య



పూలమార్కెట్ వద్ద మహిళా వ్యాపారితో మాట్లాడుతున్న ఎంహెచ్‌వో

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 3 : ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లను విక్రయించినా, వినియోగించినా సదరు దుకాణాన్ని సీజ్ చేస్తామని మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకట రమణయ్య వ్యాపారులను హెచ్చరించారు. బుధవారం నగరంలోని పూల మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులతో మాట్లాడా రు. పర్యావరణాన్ని కాపాడేందుకు వ్యాపారులు సహకరించాలని సూచించారు. ఇకపై తరచూ ఆకస్మిక తనిఖీలు జరుగుతుంటాయన్నారు. ప్రతి దుకాణం వద్ద విధిగా చెత్త బుట్టను ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్లపై పశువుల తరలింపు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

ఎన్నికల కోడ్ వర్తించదా..?



జొన్నవాడ సర్కిల్ వద్ద వైసీపీ ప్రచార హోర్డింగ్

ఈ చిత్రంలో కనిపిస్తున్న వైసీపీ ప్రచార హోర్డింగ్ ఎక్కడో మారుమూల ప్రాంతంలోనిది కాదు. నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలో ఉండే జొన్నవాడ సర్కిల్ వద్ద. నెల్లూరు రూరల్ దేవరపాళెం పంచాయతీ పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో ఇలా కొన్ని రోజులుగా హోర్డింగ్ దర్శనమిస్తున్నా... ఏ ఒక్క అధికారీ పట్టించుకోకపోవడం గమనార్హం. ఎన్నికల కోడ్ ఈ హోర్డింగ్‌కు వర్తించదా...? అంటూ ప్రజలు గుసగుసలాడుతున్నారు.

- నెల్లూరు(సిటీ)

నేడు న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 3 : నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్వర్యంలో గురువారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించనున్నారు. న్యాయవాది ఎంపీఎస్ అజయ్ కుమార్‌పై గుర్తు తెలియని దుండగుడు దాడి చేయడానికి నిరసనగా ఈ మేరకు నెల్లూరు బార్ అసోసియేషన్ కమిటీ తీర్మానించినట్లు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, ఎం సుందరయ్య యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో బొల్లినేని భేటీ

జలదంకి, ఏప్రిల్ 3: కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతో టీడీపీ జాతీ య ఉపాధ్యక్షుడు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు బుధవారం నాగ్‌పూర్‌లోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బొల్లినేని కేంద్రమంత్రికి పుష్ప గుచ్చం అందజేశారు. అనంతరం గడ్కరీ ఇచ్చిన అల్పాహారవిందులో పాల్గొని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత రాజకీయఅంశాలపై చర్చించినట్లు బొల్లినేని తెలిపారు. ఎన్డీఏలో టీడీపీ చేరిన తరువాత ఏపీలో కూటమి విజయావకాశాలపై వీరివురి మధ్య సుదీర్ఘ చర్చ కొనసాగిందని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200



మాట మడతేసి

ఐదేళ్ల కిందట ఓటేసి ఒకే ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటూ జగన్‌రెడ్డి జిల్లాలో పాదయాత్ర చేశారు. వెళ్లిన చోటల్లా హామీలు ఇచ్చారు. అద్భుతం జరుగుతుందనే నమ్మకం కలిగించారు. గెలిచాక మడమ తిప్పేశారు.మాట మడతేసేశారు. ఏందయ్యా జగనయ్యా ఇది.. అనడిగితే.. అబ్బే.. మేనిఫెస్టోలో నేను పెట్టలేదు కదా అని దబాయిస్తారు. గాల్లో ఎగిరొచ్చి వెళ్లిపోవడం తప్ప ఈ ఐదేళ్లలో ఒక్కసారి కూడా జనంలోకి రాని ముఖ్యమంత్రి తొలిసారి నేడు బులెట్ ప్రూఫ్ బస్సులో వస్తున్నారు. మళ్లీ నాకే ఓటేయండి అని అడగబోతున్నారు. జనం చెవిలో అబద్ధాల పూలు మరోసారి పెట్టబోతున్నారు. జనం మాత్రం తక్కువ తిన్నారా... దబాయింపు , దౌర్జన్యం పాలనగా సాగిన కాలంలో మౌనంగా ఉండిపోయారుగానీ ఎన్నికల వేళ జగన్‌రెడ్డి పాత హామీలను గుర్తు చేసుకుంటున్నారు. ఒక్కటీ అమలు చేయకుండా మరో ఛాన్సివ్వండి అక్కచెల్లెమ్మలూ అని మాయ చేయడానికి వస్తున్నాడని అంటున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తెరుచుకోని మన్నవరం పరిశ్రమ



శ్రీకాళహస్తి మండలం మన్నవరం వద్ద కేంద్ర ప్రభుత్వం బీహెచ్ఇఎల్-ఎన్‌టీపీసీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా ప్రాజెక్టు మంజూరు చేసింది. 2010 సెప్టెంబరు 1న నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ శంకుస్థాపన చేశారు. రూ. 6500 కోట్ల అంచనా విలువతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా 30 వేల మందికి ఉపాధి లభిస్తుందని, వంద వరకూ అనుబంధ పరిశ్రమలు వస్తాయని అంచనా. అయితే భెల్, ఎన్‌టీపీసీ చెరి రూ. వంద కోట్లు చొప్పున రూ. 200 కోట్లు మాత్రమే విడుదల చేశాయి. ఈ నిధులతో పరిపాలనా భవనం, యాష్ ప్లాంట్, ప్రహరీ మాత్రమే పూర్తయ్యాయి. విద్యుత్ పరికరాలు, ఉపకరణాల తయారీ ప్లాంట్లు ఏర్పాటు కాలేదు. దీంతో ఈ యూనిట్ అసంపూర్తిగా మూతపడింది. గత ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా జగన్ మన్నవరం ప్రాజెక్టు పనులు జరగడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్ళు దాటినా మన్నవరం ఫ్యాక్టరీని తెరిపించే దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

మళ్లీ ఓట్లకోసం వచ్చారా?

ఒక్క వాగ్దానమూ నెరవేర్చని నేతగా చరిత్ర సృష్టించిన ముఖ్యమంత్రి

యుద్ధప్రాతిపదికన గాలేరు-నగరి ప్రాజెక్టు పూర్తి చేసి జిల్లాలో పశ్చిమ మండలాలను కరువుకాటకాల నుంచీ శాశ్వతంగా కాపాడతా.. మూతపడిన సహకార చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తా... నల్లబెల్లంపై ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఎత్తివేయిస్తా... శ్రీసిటీలో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇప్పిస్తా.. శ్రీకాళహస్తి వద్ద మన్నవరం భెల్-ఎన్‌టీపీసీ పరిశ్రమ పని చేసేలా కృషి చేస్తా... సోమశిల-స్వర్ణముఖి పనులు పూర్తి చేస్తా.. పాడి రైతులకు ప్రతి లీటరుపై రూ. 4 సబ్సిడీ ఇస్తా... వ్యవసాయ విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్న పది రోజుల్లోనే కనెక్షన్ ఇప్పిస్తా... నగరిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయిస్తా... రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా.... ఇలా 2018లో పాదయాత్రలోనూ, 2019లో ఎన్నికల ప్రచారంలోనూ వైసీపీ అధినేత జగన్ ఇచ్చిన సవాలక్ష హామీలు జిల్లా ప్రజల్ని ఆశల పల్లకిలో విహరించేలా చేశాయి. జగన్ మాటలు నమ్మిన జిల్లా జనం చిన్నగొట్టిగల్లు నుంచీ తడ వరకూ, పుత్తూరు నుంచీ డక్కిలి వరకూ ఆ పార్టీకి జనం ఓట్ల వర్షం కురిపించారు. ఒక పార్లమెంటు స్థానంతో పాటు మొత్తం ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లోనూ గెలిపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చి, జగన్ ముఖ్యమంత్రి పీఠమెక్కి ఐదేళ్ళు గడచిపోయాయి. కార్మికులు, ఉద్యోగులతో కళకళలాడాల్సిన గాజుల మండ్యం చక్కెర ఫ్యాక్టరీ, మన్నవరం విద్యుత్ ఉపకరణాల పరిశ్రమ ముళ్ళ పొదల మాటున దీనావస్థను చాటుకుంటున్నాయి. కృష్ణా జలాలు ప్రవహించాల్సిన గాలేరు-నగరి కాలువలు ఒక్క అడుగు కూడా తవ్వకాలకు నోచుకోక గట్టిగా నిట్టూరుస్తున్నాయి. అమ్ముడుపోక పల్లెల్లో పేదలు దాచుకున్న నల్లబెల్లం ఎక్సైజ్ దాడుల్లో బయటపడి సారా కోసం దాచారంటూ కేసుల పాలు చేస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే జగన్ ఇచ్చిన హామీలు ఈ ఐదేళ్ళలో ఒక్కటి కూడా నెరవేరలేదు. నమ్మి ఓట్లేసి పార్టీని గెలిపించిన తమను ఆయన నిలువునా వంచించారని జిల్లా ప్రజలు వాపోతున్న పరిస్థితి. ఇపుడు మళ్ళీ ఎన్నికలు వచ్చిన తరుణంలో జిల్లాలో పర్యటిస్తున్న ఆయనకు గత హామీలను జనం గుర్తు చేస్తున్నారు.

శ్రీకాళహస్తిలో పరిశ్రమలు పెడతామన్నారు!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల పరిధిలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గత ఎన్నికల ప్రచారంలో జగన్ వాగ్దానం చేశారు. ఈ మూడు మండలాల్లో డిక్సన్, టీసీఎస్, సెల్‌కాన్, రాక్‌వన్, స్పాంజి ఐరన్, విష్ణు కెమికల్స్ శ్రీకాళహస్తి పైప్స్, కోకో కోలా, మన్నవరం, టైల్స్ కజారియా, గ్రీన్‌ప్లై వంటి ప్రముఖ సంస్థలున్నాయి. అయితే ఒకటి రెండు పాత పరిశ్రమలు కాగా మిగిలినవన్నీ గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటైనవే. గత ఐదేళ్ళలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా ఈ మూడు మండలాల్లో ఏర్పాటు కాలేదు.

గాజులమండ్యం షుగర్స్‌ను తెగనమ్మే ప్రయత్నం



దశాబ్దాల పాటు జిల్లాలో వేలాది చెరకు రైతుల కుటుంబాలకు ఆలంబనగా నిలిచిన గాజుల మండ్యం శ్రీవెంకటేశ్వర సహకార చక్కెర ఫ్యాక్టరీ నిర్వహణాపరమైన లోపాలతో నష్టాలకు లోనై 2015లో మూతపడిన సంగతి తెలిసిందే. ఇందులో 300మంది దాకా పనిచేసేవారు. జగన్ పాదయాత్రలో మూతపడిన ఫ్యాక్టరీని తెరిపిస్తామని వాగ్దానం చేశారు. అధికారంలోకి వచ్చాక దీని పునరుద్ధరణకు గల అవకాశాలను అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీ వేశారు. ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తారని రైతులు, ఉద్యోగులు ఆశపడితే ప్రభుత్వం ఏకంగా ఫ్యాక్టరీనే విక్రయించేందుకు రంగం సిద్ధం చేసింది. లిక్విడేటర్‌ను కూడా నియమించింది. ఆవరణలోని 800కు పైగా చెట్లు నరికించి విక్రయించేందుకు వేలం పాటలు సైతం నిర్వహించింది. ఫ్యాక్టరీని ప్రైవేటు పరంచేసే ప్రయత్నాలను రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ద్వారా అడ్డుకున్నారు.

గూడూరు ఆర్వోబీ గుర్తుందా?



గూడూరు పట్టణాన్ని రెండుగా విభజిస్తున్న రైల్వేలైన్ పై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయి వుండడంతో గత ఎన్నికల ప్రచారంలో జగన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. తాను అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయిస్తామని హామీ ఇచ్చారు. గూడూరు ఒకటో, రెండో పట్టణాల నడుమ రాకపోకలు సాగించేందుకు 2011 మార్చిలో రూ. 39 కోట్లతో ఫ్లైఓవర్ పనులు చేపట్టారు. స్థానిక ఐసీఎస్‌రోడ్డు వైపు, అడివయ్య కాలనీ వైపు, సిరామిక్ కళాశాల వైపు మూడు స్పాన్లుగా నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. రూ. 16 కోట్లతో రైల్వే శాఖ పట్టాలపై ఫ్లైఓవర్ పనులను పూర్తిచేసింది. రూ. 23 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 2014లో పనులు నిలిచిపోవడంతో 2015 డిసెంబరులో భూసేకరణ, వంతెన నిర్మాణానికి రూ. 63కోట్లు మంజూరయ్యాయి. అయినా పనులు జరగలేదు. జగన్ హామీ ఇచ్చి ఐదేళ్ళు పూర్తవుతున్నా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు.తిరుపతి, చెన్నై వైపు రైళ్లు వేళ్లే మార్గాల్లో రైలు గేట్లు వేస్తుండడంతో రెండు పట్టణాల వైపు రాకపోకలు సాగించే ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సివస్తుంది.

అపాచీ పేరుతో ఆర్భాటం



శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు వద్ద భారీ పాదరక్షలు పరిశ్రమ అపాచీ కంపెనీ నెలకొల్పుతున్నట్లు వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. 2022 జూన్ 23న సీఎం జగన్ ఇనగలూరులో పరిశ్రమ స్థాపనకు భూమి పూజ చేశారు. ఆ తర్వాత పరిశ్రమ నిర్మాణపరంగా ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. కనీసం భూమి పూజ జరిగిన చోట శంకుస్థాపన శిలాఫలకం ఆనవాళ్లు కూడా లేకుండా మాయం చేశారు.

శ్రీసిటీలో స్థానికులకేవీ 75 శాతం ఉద్యోగాలు?

శ్రీసిటీ పరిధిలో మొత్తం 150కి పైగా పరిశ్రమలుండగా సుమారు 50వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. ఉపాధి పొందుతున్న వారిలో తమిళనాడు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వారు ఎక్కువమంది వుండగా రాష్ట్రంలోని ఇతర జిల్లాల వారు, కర్ణాటకకు చెందిన వారు తక్కువ గానా



వున్నారు. ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్ శ్రీసిటీ పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన పదవీ కాలం ముగుస్తున్నా ఇచ్చిన హామీని నెరవేర్చే విధంగా ఎలాంటి ప్రయత్నాలూ జరగలేదు. ఇక్కడ మొత్తం ఉద్యోగాల్లో 40శాతం మాత్రమే స్థానికులకు దక్కుతున్నాయి.

అవ్వాతాతలు

ఉసురు పోసుకున్నారు

- సచివాలయాల వద్ద వృద్ధుల పడిగాపులు
- సాయంత్రం 4 గంటలకు కూడా నోక్యాష్
- కొన్నిచోట్ల సర్వర్ల మొరాయింపు
- మొత్తమ్మీద 43శాతం పెన్షన్ల పంపిణీ





తిరుపతి ఖాదీ కాలనీ వద్ద సచివాలయానికి చేరుకుంటున్న వృద్ధ మహిళలు - తిరుపతి ఐఎస్ మహల్ రోడ్డులోని సచివాలయం వద్ద వృద్ధుల పడిగాపులు

తిరుపతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ల పంపిణీ వ్యవహారాన్ని రాష్ట్రప్రభుత్వం గందరగోళంగా మార్చేసింది.దివ్యాంగులకు, వృద్ధులకు, రోగులకు ఇంటివద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని, తక్కినవారికి సచివాలయాల్లో పంపిణీ పంపిణీ చేయాలంటూ జారీ చేసిన మార్గదర్శకాలు క్షేత్రస్థాయిలో గాలికొదిలేయడంతో జిల్లా వ్యాప్తంగా సచివాలయాల వద్ద పింఛనుదారులు పడిగాపులు కాయాల్సివచ్చింది. నగదుకోసం బ్యాంకులకు వెళ్లిన సచివాలయాల సిబ్బంది, సాయంత్రం 4 గంటలకు కూడా తిరిగి రాకపోవడంతో వృద్ధులకు అవస్థలు తప్పలేదు. కొన్నిచోట్ల సర్వర్లు పనిచేయకపోవడంతో మండుటెండలో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.తగిన నీడ, తాగునీటి సౌకర్యాలుకూడా కల్పించలేదు.కొన్నిచోట్ల సచివాలయాల వద్ద టీడీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తే వాటిని కూడా అడ్డుకున్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయించిన సందర్భాలున్నాయి. అప్పుడు చేయగలిగింది, ఇప్పుడు ఎందుకు చేయలేకపోయారని పెన్షన్ దారులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలవేళ జగన్ స్వార్ధ ప్రయోజనాల కోసం ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ఘాటుగా ప్రశ్నిస్తున్నారు. జగన్ ఆదేశాలతో అధికారులు ఉద్దేశపూర్వకంగానే పెన్షన్ల పంపిణీ ఆలస్యమయ్యేలా చేస్తున్నారని అవ్వా, తాతలు అనుమానిస్తున్నారు. తమ చేతకానితనం బయటపడకుండా తప్పించుకునేందుకు ఆ నెపాన్ని టీడీపీపై నెడుతోందని మండిపడుతున్నారు.

● ఏర్పేడు మండలంలోని 19 సచివాలయాల్లో సాయంత్రం 6 గంటల వరకు కూడా పింఛన్ల పంపిణీ జరగలేదు. మండల పరిధిలో ప్రభుత్వం నుండి రావాల్సిన పింఛన్ల మొత్తంలో 25శాతం మాత్రమే బ్యాంకులో జమకావడం వలన కొందరికిచ్చి, మరికొందరికి ఇవ్వలేకపోయారు.ఆరుగంటల తర్వాత కొంతమేర పంపిణీ చేసినట్టు తెలిసింది. కోట మండలం గూడలి సచివాలయం వద్ద నగదు తక్కువ రావడంతో పింఛన్ల కోసం ఎగబడ్డారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని గిరిజన కాలనీలో పెన్షనర్లు మూడు కిలోమీటర్లు ఎండలో నడిచి రావాల్సి వచ్చింది. తిరుపతి రూరల్ మండలం ముళ్లపూడి పంచాయితీ లబ్ధిదారులకు అక్కడ పాడిపేట సచివాలయంలో ఇచ్చారు. జిల్లాలో 271477 మంది ఫించనుదారులుండగా 116958 మందికి పంపిణీ చేశారు. అంటే 43 శాతం పంపిణీ జరిగింది. అత్యల్పంగా తడలో 9.28శాతం, డక్కిలిలో 15.49, ఓజిలిలో 15.86, కోటలో 17.55, గూడూరులో 19.21 శాతం పెన్షన్లు మాత్రమే ఇవ్వగలిగారు. బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం మండలాల్లో అత్యధికంగా 70 శాతానికి పైగా పెన్షన్ల పంపిణీ జరిగింది.

పెన్షన్ తీసుకునేందుకు వెళ్లి ఇద్దరి మృతి



నన్నె సాహెబ్ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట/ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 3:పెన్షన్ తీసుకునేందుకు వచ్చి ఇద్దరు మృత్యు వాత పడ్డారు. సూళ్లూరుపేట పట్టణం గాండ్లవీధిలో వున్న సచివాలయం వద్దకు బుధవారం మధ్యాహ్నం సాయినగర్‌కు చెందిన లలితమ్మ(58) వెళ్లింది. కుర్చీలో కూర్చొని ఉండగా చేతిలో ఉన్న ఆధార్ కార్డు పడిపోయింది.దాన్ని తీసుకొనేందుకు కుర్చీలో నుంచి లేచే ప్రయత్నంలో కిందపడిపోయింది. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరిశీలించి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. ఎర్రావారిపాలెం మండలం నెరబైలుకు చెందిన నన్నె సాహెబ్ (68) ఇంటికి 100 మీటర్ల దూరంలో వున్న సచివాలయానికి బుధవారం పెన్షన్ తీసుకుందామని నాలుగు సార్లు వెళ్లొచ్చాడు. మధ్యాహ్నం 2.45గంటలకు మరోసారి వెళ్ళాడు. ఎండ వేడి ఎక్కువగా ఉండడం, నిరీక్షణ వల్ల షైకం కమ్మి కుప్పకూలిపోయాడు.వెంటనే 300మీటర్ల దూరంలో వున్న ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆస్పత్రిలో డాక్టరు లేకపోవడంతో పరిశీలించిన వైద్యసిబ్బంది అప్పటికే మరణించినట్టు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ పింఛన్లందిస్తాం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 3:అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లు అందజేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2,71,477మందికి విడుదలైన పింఛన్లలో బుధవారం సాయంత్రం 7గంటల వరకు 43.08 శాతం మందికి అందించినట్లు తెలిపారు. రెండు రోజుల్లో అందరికీ అందజేస్తామన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా నడవలేనివారు, ఆరోగ్యం సరిలేనివారు ఇంటి వద్దనే ఉండాలని అలాంటి వారికి ఇంటివద్దకు వచ్చి పింఛన్లు అందజేస్తామని తెలిపారు.



స్లోగా వెళుతున్న బస్సు లోంచే జగన్ అభివాదం

కార్యకర్తలున్నా ఆగని జగన్ బస్సు

- చీకట్లో చేతులూపుతూ సాగిపోయిన సీఎం

తిరుపతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పల్లెలే కాదు పట్టణాలు, ప్రధాన కూడళ్లలో కూడా సీఎం జగన్ బస్సు యాత్ర ఆగలేదు. నేతలు తరలించిన కార్యకర్తలు పెద్దసంఖ్యలో గంటల కొద్దీ నిరీక్షిస్తున్నా కనీసం బస్సు ఆపే ప్రయత్నం చేయలేదు. చీకట్లో చేతులూపుతూ సీఎం ముందుకు సాగిపోయారు.మేమంతా సిద్ధం పేరిట జగన్ చేపట్టిన బస్సు యాత్రకు బుధవారం రాత్రి పాకాల మండలం గాదంకి టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలికేందుకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పెద్దసంఖ్యలో కార్యకర్తలను తరలించారు. రాత్రి 7.50గంటలకు టోల్ ప్లాజా వద్దకు చేరుకున్న బస్సు ఆపి జగన్ కిందకు దిగుతారని కార్యకర్తలు వేచి చూస్తుండగా కనీసం స్లో కూడా చేయకుండా బస్సు వేగంగా దూసుకుపోయింది. బస్సులో నుంచే శ్రేణులకు చేతులూపుతూ జగన్ ముందుకు సాగిపోయారు. దీంతో కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురయ్యారు. అలాగే చంద్రగిరి పట్టణం వెలుపల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వద్ద ఎమ్మెల్యే చెవిరెడ్డి భారీ ఎత్తున కార్యకర్తలను సమీకరించారు.అక్కడ కూడా స్లోగా వెళుతున్న బస్సు అద్దాల లోంచి జగన్ చేతులూపుతూ వెళ్ళిపోయారు. వినతి పత్రం ఇచ్చేందుకు వేచి వున్న ఓ కార్యకర్త బస్సు ఆపకపోవడంతో అడ్డుపడ్డాడు. అయితే పోలీసులు అతన్ని దురుసుగా పక్కకు లాగేశారు. కాగా జగన్ బస్సు వెళుతున్న సమయంలో కార్యకర్తల్లో తొక్కిసలాట జరిగి సుకన్య (40) అనే మహిళ స్పృహ కోల్పోయింది.బస్సు యాత్ర సందర్భంగా చిత్తూరు మార్గంలో అరగంట పాటు వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్సు

జగన్ బస్సు యాత్ర గాజులమండ్యం కూడలి చేరుకునే సమయానికి జనం ఎవ్వరూ లేరు. పోలీసులు అరగంట పాటు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో పుత్తూరు నుంచీ వస్తున్న 108 అంబులెన్సు ట్రాఫిక్‌లో చిక్కుకుంది. అంతకు మునుపు తిరుపతి శివార్లలోని ఉప్పరపల్లి వద్ద కూడా బైపాస్ రోడ్డు -తిరుపతి మార్గంలో రాకపోకలు ఆపేశారు. తిరుచానూరు క్రాస్ వద్ద కూడా పెద్దసంఖ్యలో కార్యకర్తలు నిరీక్షిస్తున్నా బస్సు ఆపలేదు.బస్సును ఆపేందుకు యత్నించిన కార్యకర్తలను, మహిళలను కూడా పోలీసులు నెట్టేశారు.

నేడు నాయుడుపేటలో బహిరంగసభ

రేణిగుంటలో బుధవారం రాత్రి బస చేసిన జగన్ గురువారం నాయుడుపేటలో జరిగే మేమంతా సిద్ధం సభలో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు బస్సు యాత్ర తిరిగి ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12.30 గంటలకు తొట్టంబేడు మండలం పొయ్య గ్రామంలో లారీ, ఆటో డ్రైవర్లతో జగన్ సమావేశమవుతారు. సాయంత్రం 4.30 గంటలకు నాయుడుపేట చేరుకుని సభలో పాల్గొంటారు. అనంతరం నెల్లూరు రూరల్ మండలం చేరుకుని రాత్రి బస చేస్తారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురువారం) : సా. 6.28
సహరి (శుక్రవారం) : ఉ. 4.46

బ్యాంకులకు ఆలస్యంగా పింఛన్ల సొమ్ము

సచివాలయాల వద్ద లబ్ధిదారుల పడిగాపులు



సూళ్లూరుపేటలో సచివాలయం వద్ద పింఛనుదారుల పడిగాపులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 3: వలంటీర్ల ద్వారా పింఛన్ల నగదు పంపిణీ చేయొద్దంటూ ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాజకీయం చేస్తూ టీడీపీపైకి నెట్టేయడానికి ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం ఉదయం నగదు కోసం బ్యాంకులకు వెళ్లిన సచివాలయాల సిబ్బంది, సాయంత్రం 4 గంటలకు తిరిగి చేరుకోకపోవడంతో లబ్ధిదారులకు అవస్థలు తప్పలేదు. ప్రభుత్వం నుంచి పింఛన్ల సొమ్ము బ్యాంకుల ఖాతాలో ఆలస్యంగా జమకావడంతో సాయంత్రం 5 గంటల నుంచి సచివాయాల వద్ద పింఛన్లను అందజేశారు. సచివాలయాల వద్ద ఉన్నవారందరికీ ఎంత రాత్రైనా పింఛను అందజేస్తామని కమిషనర్ గంగా ప్రసాద్ తెలిపారు.

గూడూరు: పట్టణంలోని సచివాలయాల్లో బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆరో తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9నుంచి రాత్రి 7గంటల వరకు పింఛన్లు అందజేయనున్నట్లు సచివాలయాల సిబ్బంది తెలిపారు. సచివాలయాల వద్దకు రాలేని లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తామని చెప్పారు.

కోట: మండలంలోని బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టారు. కోట మండలంలో 7,202 మంది పింఛనుదారులు ఉండగా వారికి ప్రతి నెలా రూ.2.16 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే కేవలం రూ.52 లక్షలు మాత్రమే పంపిణీ చేశారు. మిగతావారిని రేపు బ్యాంకుల నుంచి నగదు తీసుకువచ్చి పంపిణీ చేస్తామని పంచాయతీ కార్యదర్శులు చెప్పడంతో లబ్ధిదారులు పింఛను అందక నిరాశతో వెనుదిరిగారు.

వెంకటగిరి టౌన్: పట్టనంలోని సచివాలయాల్లో బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు.

ఒక్క ఛాన్స్‌తో సర్వనాశనం: పాశిం



టీడీపీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, ఏప్రిల్ 3: ఒక్కఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బూదనం, ఓడూరు, పున్నపువారిపాళెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దోచుకోవడమే పనిగా పాలన సాగించిందన్నారు. ఒకటో తేదీన అందించాల్సిన పింఛన్లను రెండురోజుల ఆలస్యంగా పంపిణీ చేయడమే కాకుండా టీడీపీపై బురదచల్లడం తగదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పింఛను రూ.4వేలకు పెంచడంతో పాటు ఇంటివద్దే అందిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలని సునీల్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, గుండాల లీలావతి, శ్రీనివాసులు, మునిశేఖర్‌గౌడ్, చెంచుకృష్ణయ్య, వెంకటేశ్వర్లునాయుడు, కుమార్‌యాదవ్, మస్తాన్, కీరవాణి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీవి శవ రాజకీయాలు: కురుగొండ్ల

వెంకటగిరి, ఏప్రిల్ 3: వైసీపీ నేతలు శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని 23 వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన కుమార్తె సాయిప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్ తన చిన్నాన్న హత్యను ఆజకీయాలకు వాడుకున్నారని విమర్శించారు. స్థానిక బంగారుపేటలో ఓ వృద్ధుడు సహజ మరణం చెందితే వైసీపీ నేతలు గుండెపోటుగా చిత్రీకరించి టీడీపీపై అభాండాలు వేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. పింఛన్లు సొమ్మును కాంట్రాక్టర్లకు దోచి పెట్టి అవ్వా తాతలను మోసం చేసిన జగన్‌ను ప్రజలు ఛీకొడుతున్నారని చెప్పారు. దనియాల సుభాష్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో 30 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. వారందరికి కురుగొండ్ల రామకృష్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మండల పరిధిలోని మొగళ్లగుంట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వాహించారు. ఇక్కడ పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్‌నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు, మల్లారం బాబు, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్ చౌదరి, నాని, చంటి పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

పెళ్లకూరు, ఏప్రిల్ 3: మండలంలోని పాలచ్చూరు ఎంపీటీసీ కాటంరెడ్డి జాన్సీ భర్త, వైసీపీ నాయకుడు కాటంరెడ్డి మల్లిఖార్జున్‌రెడ్డితో పాటు రాజా, మధు తదితరులు నాయుడుపేట ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కండువాలు వేసి ఆహ్వానించారు. అదేవిధంగా మండలంలోని చిల్లకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పాపాడి రాజగోపాల్‌రెడ్డిని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్థానిక నేతలు పేరం రమేష్‌నాయుడు, మధుసూదన్ నాయుడు, ప్రసాద్‌నాయుడు, సంచి కృష్ణయ్య, నాగేంద్రప్రసాద్‌రెడ్డి వెళ్లి కలిశారు. టీడీపీ విజయం కోసం పనిచేయాలని కోరగా, సమ్మతించిన రాజగోపాలరెడ్డి ఇకపై పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విజయశ్రీ విజయం కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మరళీకృష్ణారెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, మైలారి రాజ.శేఖర్, పసల గంగాప్రసాద్, గాలి రమేష్‌నాయుడు, మునసూరు రామచంద్రారెడ్డి, మాధవ రెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రయ్య, పోలయ్య, రమణయ్య, సుబ్రహ్మణ్యం, సురేష్, పరుశురాం తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కోసం వెళ్లి...

హత్యకు గురైన యువకుడు

● తనపల్లి హౌసింగ్ కాలనీలో ఘటన

తిరుచానూరు, ఏప్రిల్ 3: సెల్‌ఫోన్ విషయమై జరిగిన గొడవలో స్నేహితుడి కోసం వెళ్లిన ఓ యువకుడు హత్యకు గురైన ఘటన తిరుపతి రూరల్ మండలం తనపల్లి హౌసింగ్ కాలనీలో తీవ్ర కలకలం రేపింది. తిరుచానూరు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలి ఇలా.. తనపల్లి హౌసింగ్ కాలనీలో సింగారం అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. అతని వద్ద దుర్గాప్రసాద్ అలియాస్ నాని అనే యువకుడు సెల్‌ఫోన్ కుదవపెట్టాడు. అయితే డబ్బు చెల్లించి తన ఫోన్ ఇవ్వాలని మూడురోజులుగా సింగారం ఇంటికి వెళ్లినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అది కాస్త గొడవకు దారితీసింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సింగారం ఇంటికి వెళ్లిన దుర్గాప్రసాద్ డబ్బు కట్టేసినా సెల్‌ఫోన్ ఎందుకు ఇవ్వలేదని గొడవపడటంతో సింగారం ఇంటి పక్కన ఉన్న పద్మావతి అనే మహిళ వారించింది. మాటామాటా పెరగడంతో ఆమెపై దుర్గాప్రసాద్ చేయిచేసుకున్నాడు. దీంతో పద్మావతి కుమారులు చరణ్, మణికంఠ కలిసి దుర్గాప్రసాద్‌పై దాడి చేయడంతో తనపై దాడి జరిగిందని.. వెంటనే రావాలని కుంట్రపాకంకు చెందిన తన స్నేహితుడు సునీల్‌కు దుర్గాప్రసాద్, ఫోన్ చేయడంతో దీంతో సునీల్ మరో కొంతమంది అక్కడికి చేరుకుని పద్మావతి కుటుంబపైకి గొడవకు దిగారు. పద్మావతి కుమారులు సునీల్‌పై కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడి స్నేహితులు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా సునీల్ అలియాస్ సునీల్‌కుమార్‌రెడ్డి(23) మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం పోస్టుమార్టం అనంతరం సునీల్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. మణికంఠ, చరణ్ తదితరులపై హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు.

కారు ఢీకొని తమిళనాడువాసి మృతి

తడ, ఏప్రిల్ 3: కారు ఢీకొని తమిళనాడువాసి మృతి చెందాడు. ఈ ఘటన తడ మండలంలోని రామాపురం జాతీయ రహదారి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పొదువాళ్లూరు గ్రామానికి చెందిన ఎం.వెంకటేషన్ బేల్దారి పని చేస్తుంటాడు. మంగళవారం గుమ్మిడిపూడికి వచ్చి తన స్నేహితుడితో కలిసి తడ మండలం రామాపురం పంచాయతీ వెంకటాద్రిపాళెంలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో తిరిగి గుమ్మిడిపూడికి బయలుదేరాడు. మార్గమధ్యంలో రామాపురం జాతీయ రహదారి వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్లే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటిగుంటలో పడి మహిళ మృతి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 3: మండలంలోని మిట్టపాళెం గ్రామ సమీపాన నీటిగుంటలో పడి మీరమ్మ(49) మృతి చెందినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం బర్రెలు మేపేందుకు మీరమ్మ పొలాల్లోకి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త, గ్రామస్థులు పొలాల్లో గాలింపు చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి నీటిగుంటలో మీరమ్మ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

కోట, ఏప్రిల్ 3: కోట పట్టణ పరిధిలోని తిన్నెలపూడికి వెళ్లే రోడ్డు వద్ద బుధవారం రాత్రి ఒక కారు డివైడర్‌ను ఢీకొంది. గూడూరు నుంచి ముగ్గురు యువకులు కారులో తూపిలిపాళెం బీచ్‌కు వెళ్లి తిరిగి వస్తూ తిన్నెలపూడికి వెళ్లే రోడ్డు వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జుకాగా, అందులో ఉన్న ముగ్గురు యువకులకు స్వల్పగాయాలయ్యాయి.





యార, గురునాధస్వామి, అంకమ్మల గ్రామోత్సవం - ముత్యాలమ్మ ఆలయం ఎదుట త్రిశూలం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ముత్యాలమ్మా... కరుణించు తల్లీ

● కొలువైన పోలేరమ్మ

● జనసందోహంగా కనుపూరు





కొలువైన పోలేరమ్మ - వేయికండ్ల కుండలతో భక్తుల ప్రదక్షణలు

చిల్లకూరు, ఏప్రిల్ 3: కోర్కెలు తీర్చే కల్పవల్లీ... కరుణించి కాపాడమ్మా అంటూ భక్తుల వేడుకోలుతో చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు బుధవారం మార్మోగింది. అమ్మవారి జాతరలో రెండో రోజు భక్తుల రద్దీ మరింత పెరిగింది. పోలేరమ్మ, ముత్యాలమ్మను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జిల్లా నలుమూలలనుంచే కాకుండా ఇతర రాష్ట్రాలనుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. అమ్మవారు(ఆటలమ్మ) పోసిన భక్తులంతా మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో కొంత రద్దీ నెలకొంది. నెత్తిమీద పెట్టుకున్న వేయి కండ్ల కుండ, అందులో గండ దీపం, మొలకు వేప చీర, పడిగళ్లు, నవధాన్యాలు, ఎర్రగడ్డలు, కోడిపిల్లలను గుడిపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మను ఉదయం ఊరేగింపుగా తీసుకువచ్చి ముత్యాలమ్మ ఆలయానికి తూర్పు దిశలో ఏర్పాటు చేసిన తాత్కాలిక గుడిసెలో ప్రతిష్ఠించారు. పోలేరమ్మ మట్టి ప్రతిమతో పాటు సత్తి పోలేరమ్మ, అంకమ్మ, సిద్ధయ్య, పరుశురాముడు విగ్రహాలను ఊరేగించారు. సాయంత్రం యార, శ్రీగురునాథ స్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గొల్లల వేడుకల్లో భాగంగా గంగపెట్టె, వీరతాళ్లతో వీధుల్లో తిరిగారు. పెద్దగొల్ల చిందులు, గణాచారి నాట్యం సందడి చేశాయి. రాత్రి అమ్మవారికి పూలాంగి సేవ నిర్వహించారు. ఆలయ ఆవరణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మను కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. మూడో రోజైన గురువారం భక్తుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉండడంతో అందుకు తగినట్లు ఏర్పాట్లు చేశామని ఈవో నవీన్ కుమార్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

జగన్ సభకు బస్సులు

మండుటెండలో ప్రయాణికుల తిప్పలు



సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల పడిగాపులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 3: సీఎం జగన్ పర్యటన అంటే ప్రజలు హడలిపోతున్నారు. ఆయన సభలంటే ఆర్టీసీ బస్సులుండవని ప్రయాణికులు భయపడిపోతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఆర్టీసీ మాత్రం వైసీపీలో సేవలో మునిగితేలుతోంది. సీఎం జగన్ సభ ఎక్కడ జరిగిన డిపోలో బస్సులను తరలిస్తున్నారు. సింగిల్ రూట్ సర్వీసులను కూడా నిబంధనలకు విరుద్ధంగా తరలించడం పరిపాటిగా మారింది. సోమవారం ఉదయమే డిపో పరిధిలో 15 బస్సులను సీఎం సభకు పంపారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనుపూరు జాతర మంగళవారం నుంచి ప్రారంభం కావడంతో డిపో నుంచి పది ప్రత్యేక బస్సులను నడుపుతామని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. అయితే కేవలం రెండు బస్సులను మాత్రమే తిప్పారు. బుధవారం ఉదయం నుంచే ఇటు ప్రయాణికులు, కనుపూరుకు వెళ్లే భక్తులతో సూళ్లూరుపేట బస్టాండు కిటకిటలాడింది. ఒక బస్సు కూడా లేకపోవడంతో మండుటెండలో అల్లాడిపోయారు. కంట్రోల్ పాయింట్‌లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిని అడిగితే ఈ రోజు బస్సులు లేవు. రేపు వస్తాయంటూ సమాధానం చెప్పడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతరకు బస్సుల్లేకుండా చేయడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు.

నాయుడుపేట: చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ జాతరకు బస్సులు లేకపోవడంతో భక్తులు అవస్థలు పడ్డారు. ముఖ్యమంత్రి సభలకు బస్సులను తరలించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

గూడూరు అర్బన్: గూడూరు డిపో నుంచి బస్సులను సిద్ధం సభకు తరలించడంతో బుధవారం ప్రయాణికులు అవస్థలు పడాల్సివచ్చింది. గూడూరు డిపోలో మొత్తం 45 బస్సులు ఉండగా అందులో 10 బస్సులను సిదం సభకు పంపడంతో నెల్లూరు, తిరుపతి, రాపూరు, వెంకటగిరి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడ సీఎం సభ జరిగినా బస్సులను తరస్తుండడంతో ఇబ్బందులు తప్పడంలేదని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు.

రెండేళ్లలో ఆల్తూరుపాడు పనులు పూర్తి: కురుగొండ్ల



రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న కురుగొండ్ల, లక్ష్మీసాయిప్రియ

డక్కిలి, ఏప్రిల్ 3: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులు ప్రారంభించి రెండేళ్లలో పూర్తి చేస్తామని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియతో కలిసి ఆల్తూరుపాడు రిజర్వాయరు ప్రాంతాన్ని సందర్శించారు. నిలిచిపోయిన ప్రాజెక్టు పనుల వద్ద వారు సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2019లో ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.400 కోట్ల విడుదల చేయడం జరిగిందన్నారు. టెండర్లు పిలిచి పనులు ప్రాంభించామని తెలిపారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులు జరగనీయకుండా అడ్డుకొందని ఆరోపించారు. ఇటీవల వెంకటగిరికి వచ్చిన జగన్ రూ.555 కోట్లతో ఆల్తూరుపాడు ప్రాజెక్టు పనులు మొదలు పెడుతున్నట్లు ప్రకటించారని, అయితే ఇప్పటి వరకు ఎందుకు పనులు ప్రారంభించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టునూ జగన్ పూర్తి చేయలేదని విమర్శించారు. దోచుకోవడం... దాచుకోవడం తప్ప అభివృద్ధి చేయడం జగన్‌కు చేత కాదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, వేముల నాగభూషణం నాయుడు, రాజయ్య, తిరుపాల్, కుమార్ యాదవ్, రమేష్, పీపీ చౌదరి, శివప్రసాద్, చలపతి, డక్కిలి చంద్రారెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు చాటింపు



పోలేరమ్మకు కుంభంపోసి చాటింపు చేస్తున్న గ్రామపెద్దలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 3: నాయుడుపేట గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత శ్రీపోలేరమ్మ జాతరకు మొదటి చాటింపు వేశారు. మంగళవారం అర్ధరాత్రి అమ్మవారి ప్రతిమను తయారుచేసి కుంభంపోసి గ్రామ పెద్దల సమక్షంలో మొదటి చాటింపు వేశారు. మే 27న ఘట్టం, 28వ తేదీ రాత్రి అమ్మవారి నిలుపు, 29న జాతర నిర్వహించి, అదేరోజు రాత్రి అమ్మవారిని సాగనంపనున్నట్లు ఆలయ ఈవో శశాంక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దకాపు అరవభూమి శ్రీనివాసులు రెడ్డి, గ్రామపెద్దలు రామారావు, కుబేరు మణి, పొట్లపూడి రాజేష్, శేషగిరి, దేవతా చెంచుకిషోర్, శేషం మునిమోహన్‌రావు, మహేష్‌రెడ్డి, యుగంధర్, గణపతి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పింఛను అందజేయండి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 3: సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేయాలని కోరుతూ మున్సిపాలిటీ కమిషనర్ గంగాప్రసాద్‌కు టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏజీ కిషోర్, నాపా శివశంకర్ మునిరాజా, చీమలదండు రమణయ్య, వెంకీ యాదవ్, వెంకట్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి సంఘమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కోట, ఏప్రిల్ 3: కోట మండలం గూడలిలో వెలసిన కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ఈనెల 5నుంచి 15వ తేదీ వరకు జరగనున్నాయి. 5న బ్రహ్మోత్సవాలకు అంకుర్పాణ, గ్రామోత్సవం, 6న కోడి వస్త్రములు ధ్వజస్తంభానికి కట్టుట, ధ్వజారోహణం, 7న శేషవాహనసేవ, 8న హంస వాహనసేవ, 9న భృంగిసేవ, 10న రావణసేవ, 11న నందిసేవ, 12న రథోత్సవం, 13న ఉదయం 6.55 - 7.55 నిమిషాల మధ్య స్వామివారి కల్యాణం, 14న విమానోత్సవం, 15న ఏకాంతసేవతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

గోకులకృష్ణ ఫార్మసీలో ప్రాంగణ ఎంపికలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 3: సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఫార్మసీ కళాశాలలో బుధవారం మెడికల్ కోడింగ్ సంస్థ ఎపిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చెన్నై ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఆ కంపెనీ ప్రతినిధులు ఆష్రాఫ్ షేక్, గణేష్, జనని ఆధ్వర్యంలో ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. 7మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బాలగాని పవన్‌కుమార్ తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన క్రీడా పోటీలు

కోట, ఏప్రిల్ 3: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షిక క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు, ట్రోఫీలు అందజేశారు.

ఇంట్లో చోరీ

తడ, ఏప్రిల్ 3: తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. భీములవారిపాళెం గ్రామానికి చెందిన మణికంఠన్, లక్ష్మీప్రియ దంపతులు సోమవారం రాత్రి సమయంలో బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో బీరువా సైతం తెరచి ఉండటంతో చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎనిమిది సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లుగా పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేతకు నెలవల పరామర్శ



చెంచుకృష్ణమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నెలవల

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 3: పట్టణ పరిధిలోని జువ్వపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బిరదవాడ నారాయణ తల్లి చెంచుకృష్ణమ్మ(75) మృతి చెందింది. బుధవారం ఆమె మృతదేహానికి సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం నివాళులర్పించారు. నారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు విజయకుమార్ నాయుడు, నాగేంద్రరెడ్డి, మధునాయుడు తదితరులు ఉన్నారు.

కవి సమ్మేళనానికి ఆహ్వానం



కుమార్

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 3: మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను పురస్కరించుకుని నిర్వహించనున్న కవి సమ్మేళనానికి పట్టణానికి చెందిన భక్తకవి పెనగలూరి కుమార్‌కు ఆహ్వానం అ ందింది.

అక్రమ రవాణా సాగిస్తే చర్యలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 3: ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా వాహనాల్లో మద్యం, ఇతర వస్తువులను అక్రమంగా రవాణా సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద వాహనాలను, ఆర్టీసీ బస్సులను తనిఖీ చేశారు.

జగన్ పర్యటన.. జనానికి కష్టాలు

నాయుడుపేట, ఏప్రిల్ 3: నాయుడుపేట - నరసారెడ్డికండ్రిగ అన్నమేడు క్రాస్ రోడ్డు మధ్యలో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి జగన్ సభ జరగనుంది. తిరుపతి, శ్రీకాళహస్తి, చెన్నై, బెంగుళూరు, విజయవాడ ప్రాంతాలకు వెళ్లే వాహనాలన్నీ ఈ కూడలి ప్రాంతం ద్వారా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ ప్రాంతంలో జగన్ సభ నిర్వహిస్తుండడంతో వాహనాలను దారి మళ్లించారు. నెల్లూరు నుంచి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు గూడూరు జంక్షన్ నుంచి బాలయ్యపల్లి, వెంకటగిరి, ఏర్పేడు మీదుగా తిరుపతికి, నెల్లూరు వైపు నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే వాహనాలు గూడూరు జంక్షన్ నుంచి బాలయపల్లి, వెంకటగిరి నుంచి శ్రీకాళహస్తికి, నెల్లూరు వైపు నుంచి చెన్నై వెళ్లే వాహనాలు నాయుడుపేట మండలం పండ్లూరు జంక్షన్ నుంచి తుమ్మూరు, ఆర్టీసీ బస్టాండ్, మల్లాం జంక్షన్ నుంచి నాయుడుపేట నుంచి తిరుపతి వైపుకు వెళ్లే వాహనాలు వెంకటగిరి మీదుగా తిరుపతికి వెళ్లవాల్సిందని, చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే వాహనాలు నాయుడుపేట నరసారెడ్డికండ్రిగ జంక్షన్ నుండి కుడివైపు నుంచి మర్లపల్లి గ్రామం, అన్నమేడు జంక్షన్ నుంచి నెల్లూరుకు వెళ్లేలా దారి మళ్లించారు. దీంతో పట్టణ ప్రజలతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

టీడీపీ పాలనలోనే మహిళల రక్షణ



ప్రచారంలో పాశిం సంధ్యారాణి, టీడీపీ నేతలు

గూడూరు, ఏప్రిల్ 3: టీడీపీ పాలనలోనే మహిళల రక్షణ లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక వాలాయనందపురంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మహిళల అభివృద్ధికి చంద్రబాబునాయుడు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు పరిచారని, డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఉమ్మడి కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, వీరుబోయిన వెంకటేశ్వర్లు, నటశేఖర్, మునీంద్రబాబు, వల్లూరు మోహన్, చైతన్య, నాగమణి, సురేశ్, నరసింహులు, తిరుపాల్, భారతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడండి



మాబాకలో ప్రచారం నిర్వహిస్తున్న పరసారత్నం, నెలవల, విజయశ్రీ

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 3: రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని మాబాక, ద్వారకాపురం, తిమ్మాజికండ్రిగ గ్రామాల్లో బుధవారం మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీతో కలసి ప్రచారం నిర్వహించారు. ముందుగా కోనేటిరాజుపాళెం వద్ద తెలుగు యువత నేత గాలి రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాబాక, ద్వారకాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పరసారత్నం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో మద్యపాన నిషేధం అమలు చేస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు గూడూరు ప్రభావతమ్మ, టీడీపీ నాయకులు ఉషారాణి, రఫీ, మధునాయుడు, వేమసాని శోభన్ నాయుడు, దయాకర్‌నాయుడు, ప్రభాకర్‌నాయుడు, పరసా రాజా, అవధానం సుధీర్, రవి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మండల పరిధిలోని మంగళంపాడులో బుధవారం రాత్రి విజయశ్రీతో కలిసి టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. ముందుగా గ్రామంలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరసా వెంకటరత్నం మాట్లాడుతూ వైసీపీ ఎన్ని కుట్రలు చేసిన టీడీపీ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, కొక్కు శంకరయ్య, ఏలిమేటి సతీష్, సుబ్రమణ్యం, గురులక కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

గూడూరు, ఏప్రిల్ 3: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఆర్డీవో కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి రాజకీయ పార్టీలు చేస్తున్న ఖర్చు ఆయా పార్టీల ఖాతాలోకి, నామినేషన్ వేసిన అనంతరం చేసే ఖర్చులు అభ్యర్థి ఖాతాలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన సువిధ యాప్ ద్వారా రాజకీయ పార్టీలు దరఖాస్తు చేసుకుని అనుమతులు పొంది ఎన్నికల ప్రచారం, సభలు, ర్యాలీలు నిర్వహించుకోవచ్చునని తెలిపారు. ఇందుకోసం రెండు రోజుల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు కరుణ్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.